

# ఎల్లో సింగం
YELLOW SINGAM



డిజిటల్ న్యూస్ పేపర్ || ఎడిటర్ సూర్యచౌదరి

సంపుటి: 1 | సంచిక: 234 | పేజీలు 12 | వేల 4/- | శుక్రవారం 8 ఆగష్టు 2025


# నేతన్నలకు బంగారు భవిష్యత్తు

- ❑ నేతన్నలకు బంగారు భవిష్యత్తు
- ❑ మంగళగిరిలో ఘనంగా 11వ చేనేత దినోత్సవం
- ❑ ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల భరోసా
- ❑ ఉచిత విద్యుత్ ప్రారంభం
- ❑ మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు
- ❑ చేనేత పథకాలపై రూ.190 కోట్ల భారంతో నూతన దిశ
- ❑ అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు
- ❑ ప్రగడ కోటయ్య జయంతి అధికారికంగా నిర్వహణ
- ❑ నేతన్నల అభివృద్ధికి లోకేష్ నిరంతర కృషి
- ❑ టీడీపీకి బీసీల మద్దతు, బెదిరింపులకు తలొగ్గని ధైర్యం
- ❑ పీ4 కార్యక్రమం ద్వారా 1330 బంగారు కుటుంబాలు
- ❑ వీవర్‌శాలలో నేతన్నలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి




మంగళగిరి వీవర్‌శాలలో సీఎం చంద్రబాబు చేనేత కళాకారులతో ముఖాముఖి. రూ.25 వేల నేతన్న భరోసా, ఉచిత విద్యుత్, జీఎస్టీ రీయింబర్స్ వంటి సంస్కరణలతో చేనేతల జీవనోన్నతి దిశగా దూసుకుపోతున్నామని ప్రకటించారు. సాంప్రదాయ వైభవం మరియు ఆధునికతతో చేనేత రంగం పునర్జీవించనుందని సీఎం హామీ.



## చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగం!

- ◆ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం పాల్గొనటం గర్వకరం
- ◆ మగ్గాలకూ ఉచిత విద్యుత్ - రూ. 30,000 వరకు ఆదాయం
- ◆ చేనేతకు శిక్షణలు, మార్కెటింగ్, మద్దతు పథకాలు
- ◆ టిడిపి హయాంలో చేనేతకు ప్రాధాన్యం, సంక్షేమం
- ◆ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



సంపాదన కాదు..

## సహాయంలోనే సంతృప్తి!

- ❑ నాటి జన్మభూమి సమాజం కోసం..
- ❑ నేటి పీ4 పేదరిక నిర్మూలన కోసం
- ❑ పేదరిక నిర్మూలనకు పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం
- ❑ సమాజం ఎదగాలంటే, అందరితో కలిసి ముందుకు!
- ❑ సాయం చేయడం గొప్పతనం, దాతృత్వం మార్గం
- ❑ సమాజాన్ని బలపర్చే కో-స్పాన్సర్ విధానం ప్రారంభం
- ❑ ప్రగతికి ప్రజల భాగస్వామ్యం అవసరం
- ❑ పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో సీఎం చంద్రబాబు

## చేనేత రంగానికి పూర్వ వైభవం తెస్తాం

- ఆదివారపుపేట, అద్దంపల్లి నేతన్నల దత్తత
- చేనేత యూనిట్లకు విద్యుత్ రాయితీ
- నూలు కొనుగోలుపై సబ్సిడీ, జీఎస్టీ మినహాయింపు
- నేతన్న నేస్తం ద్వారా రూ. 25,000 ఆర్థిక సహాయం
- ముద్రా రుణాలుగా రూ. 45 లక్షలు మంజూరు
- 50 ఏళ్లు పై నేతన్నలకు రూ. 4,000 పింఛన్
- ఆగస్ట్ 16న సమస్యలపై సమీక్షా సమావేశం
- ‘ఒక జిల్లా - ఒక ఉత్పత్తి’లో 4 చేనేత అవార్డులు
- గౌరవ జీవనానికి చేనేతకు భరోసా పథకాలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





# నేతన్నలకు బంగారు భవిష్యత్తు

- మంగళగిరిలో ఘనంగా 11వ చేనేత దినోత్సవం
- ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల భరోసా
- ఉచిత విద్యుత్ ప్రారంభం
- మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు
- చేనేత పథకాలపై రూ.190 కోట్ల భారంతో నూతన దిశ
- అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు
- ప్రగడ కోటయ్య జయంతి అధికారికంగా నిర్వహణ
- నేతన్నల అభివృద్ధికి లోకేష్ నిరంతర కృషి
- టీడీపీకి బీసీల మద్దతు, బెదిరింపులకు తలొగ్గని ధైర్యం
- పీ4 కార్యక్రమం ద్వారా 1330 బంగారు కుటుంబాలు
- వీవర్‌శాలలో నేతన్నలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి

**మంగళగిరి, ఆగష్టు 7(ఎల్లో సింగం):** రాష్ట్రంలోని చేనేత కళాకారుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేతన్న భరోసా కింద ఏడాదికి ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించారు. గురువారం గుంటూరు జిల్లా, మంగళగిరిలో నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు... విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో గతంలో ఏర్పాటైన వీవర్‌శాలను సందర్శించారు. అక్కడ చేనేత కళాకారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగించారు.

ఈ నెల నుంచే ఉచిత విద్యుత్ అమలు

చేనేతల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ నెల నుంచే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. 'ఉచిత విద్యుత్ పథకం' ద్వారా రాష్ట్రంలో చేనేత మగ్గాలున్న 93 వేల కుటుంబాలకు, పవర్ లూమ్స్ ఉన్న 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుంది. దీనికోసం ప్రభుత్వం ఏడాదికి రూ.190 కోట్లు ఖర్చు అవుతుంది. నేతన్నలకు 50 ఏళ్లకే పింఛన్ మొదలుపెట్టింది టీడీపీనే. 92,724 కుటుంబాలకు లబ్ధి కలుగుతోంది. సామాజిక పింఛన్లు రూ.4,000కు పెంచడం ద్వారా ఏడాదికి రూ.546 కోట్లు కేవలం వీవర్స్ పెన్షన్ కోసం ఖర్చు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### చేనేత వైభవానికి పుట్టిల్లు మన తెలుగునేల

చేనేత కళాకారులను చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భారతీయ శక్తి, సంస్కృతి, సాంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత మన నేత కార్మికులదేనని ప్రసంశించారు. 'ఆరుగజాల చీర అగ్గిపెట్టెలో పెట్టగలిగే నైపుణ్యం మన చేనేత కళాకారుల సొంతం. అన్నదాత అన్నంపెడితే... నేతన్న మనకు నాగరికత నేర్పాడు. మంగళగిరి, ధర్మవరం, వేంకటగిరి, ఉప్పాడ, పెడన, చీరాల, పొందూరు, మదనపల్లి, నందవరం, కోడుమూరు, ఎమ్మిగనూరు ఒక్కో ప్రాంతానిది ఒక్కో ప్రత్యేకత. ఆనాడు పొందూరు ఖద్దరును గాంధీజీ మెచ్చితే... పెడన కళంకారీ ప్రపంచాన్నే ఆకట్టుకుంది. బ్రిటీష్ వారు మన నేతన్నలు నేసిన ఉత్పత్తులను ఇంగ్లండ్ తీసుకు వెళ్లి అక్కడ విక్రయించేవారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఖద్దరు వస్త్రాలు ధరించడం, నూలు వడకటం దేశభక్తికి నిదర్శనం' అని సీఎం వివరించారు.

### జీఎస్టీని రీయింబర్స్ చేస్తాం

గత ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసిందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తనకు మొదట గుర్తొచ్చేది చేనేత కార్మికుల సంక్షేమమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేనేత రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఆప్కో ద్వారా చేసే ఉత్పత్తులను కొనుగోళ్లను నిలిపేశారు.

2019కి ముందు నూలు, రంగుపై ఇచ్చే సబ్సిడీని ఎత్తేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా చేనేత ఉత్పత్తులపై విధించే 5 శాతం జీఎస్టీని రీయింబర్స్ చేస్తాం. దీనికి ఏడాదికి రూ.15 కోట్లను ప్రభుత్వం భరిస్తుంది. రూ.5 కోట్లతో పొదుపు నిధి (థ్రిఫ్ట్ ఫండ్) ఏర్పాటు చేస్తున్నాం. 5,386 మంది చేనేత కళాకారులకు దీనితో ప్రయోజనం చేకూరుతుంది' అని ముఖ్యమంత్రి వివరించారు.

లిఅమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం

ఎన్డీయే ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటుందని, రాష్ట్రంలోని మాస్టర్ వీవర్లు, కళాకారులు ఉత్పత్తుల్లో రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించారని అన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. 'చేనేత పరిశ్రమను ముందుకు తీసుకెళ్లాలనే తపన ఉన్న పారిశ్రామికవేత్త సుచిత్రా ఎల్లాను సలహాదారుగా పెట్టుకున్నాం. వన్ ప్రొడెక్ట్, వన్ డిస్ట్రిక్ట్ కింద రాష్ట్రానికి వచ్చిన 9 అవార్డుల్లో 4 చేనేత రంగానికే వచ్చాయి. ఓఎన్‌డీసీ ద్వారా ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తున్నాం. ఇప్పటికే 2 వేల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీలో నమోదయ్యాయి. చేనేతకు చేయూతను ఇచ్చేందుకు నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కింద 5 చోట్ల కొత్త హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభిస్తున్నాం. మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలో రూ.74 కోట్లతో ఈ క్లస్టర్ల ఏర్పాటు జరుగుతోంది. వీటి ద్వారా 11,374 మంది చేనేత మహిళలకు లబ్ధి కలుగుతుంది' ముఖ్యమంత్ర వివరించారు.

### అధికారికంగా ప్రగడ కోటయ్య జయంతి

చేనేత వర్గాల ప్రయోజనం కోసం సత్యాగ్రహం చేసిన చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య జయంతిని ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ-గుంటూరు జాతీయ రహదారిపై ఎన్నారై ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత సర్కిల్లో ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

చేనేత కార్మికులు... టీడీపీకి అవినాభావ సంబంధం

టీడీపీకి, చేనేత కార్మికులకు మధ్య అవినాభావ సంబంధం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదినే నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సగం ధరకే చీర, ధోవతి ప్రవేశపెట్టి నేతన్నకు ఉపాధి కల్పించారని చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మంది ఆధారపడి జీవిస్తున్న రంగం చేనేత రంగం. దాదాపు 1,22,644 కుటుంబాలు ఈ రంగంలో ఉన్నాయి. అధికారంలో ఉంటే మేలు చేశాను... ప్రతిపక్షంలో ఉంటే మీ తరపున పోరాటాలు చేశాం. 2014-2019 మధ్య రూ.110 కోట్లతో చేనేత కళాకారుల రుణాలు మాఫీ చేశాం. 55,500 మంది కార్మికులకు రూ.2 లక్షల చొప్పున రూ.27 కోట్ల రుణాలిచ్చాం. 90,765 కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. మరమగ్గాల కొనుగోలుకు 50 శాతం రాయితీ ఇచ్చి రూ.80 కోట్లు ఖర్చు చేశాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

### లోకేష్ చరిత్ర సృష్టించారు

పార్టీ ఆవిర్భావం నుంచి మంగళగిరిలో టీడీపీ ఒకసారి మాత్రమే గెలిచిందని, అందుకే ఆలోచించి పోటీ చేసే నియోజకవర్గం ఎంపిక చేసుకోవాలని గతంలో తాను లోకేష్‌కు సూచించానని సీఎం చంద్రబాబు వఅన్నారు. అయినా లోకేష్ మంగళగిరిలోనే పోటీచేసి మొదటిసారి 5 వేల ఓట్ల తేడాతో ఓడిన చోటే మళ్లీ 91 వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో 873 మంది నేతన్నల కోసం అత్యాధునిక రాట్నాలు ఇచ్చారు. వీవర్ శాల ఏర్పాటు చేసి 20 మగ్గాలు పెట్టారు. 3 వేల కుటుంబాలకు బట్టలు పెట్టి పట్టాలు అందించారంటే అదీ పేదల పట్ల, చేనేతల పట్ల లోకేష్ చిత్తశుద్ధికి నిరద్శనం. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నందం అబద్దయ్య, డైరెక్టర్‌గా కందుల నాగార్జున, టీటీడీ బోర్డ్ మెంబర్‌గా తమ్మిశెట్టి జానకిదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్‌గా జనసేన నుంచి చిల్లపల్లి శ్రీనివాస్‌ను నియమించాం' అని అన్నారు.

### సెలూన్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

టీడీపీ ఆవిర్భావం నుంచి వెనుకబడిన వర్గాలు తోడుగా ఉన్నాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే... గత ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే బిసిల కోసం ఆదారణ పథకాన్ని తెచ్చాం. 2014 తరువాత ఆదరణ 2 ద్వారా రూ.964 కోట్లు పనిముట్లు కోసం ఖర్చు పెట్టాం. త్వరలో ఆదరణ పథకం-3 తీసుకొస్తాం. బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ బాసటగా నిలుస్తుంది. బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాం. దేవాలయాల్లో పనిచేసే నాయిబ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచాం. సెలూన్‌లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తాం.

40 వేల నాయిబ్రాహ్మణ కుటుంబాలకు లబ్ది కలుగుతుంది. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించాం. బార్లలోనూ 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాం. మత్స్యకారులసేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థికసాయం అందించాం. వడ్డెరల కోసం 10 శాతం క్వారీలు కేటాయిస్తాం. యాదవుల కోసం పాడి పరిశ్రమలో ప్రోత్సాహం అందిస్తాం. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పథకంలో బీసీలకు 3 కిలోవాట్లకు రూ.98 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాబోయే నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లు బీసీలకు ఖర్చుచేస్తాం. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకూ పోరాడతాం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### గత ప్రభుత్వ బెదిరింపులకు బీసీలు బెదరలేదు

వైసీపీ ప్రభుత్వం నాడు అడుగడుగునా బీసీలను అణగదొక్కిందని, అయినా ఆ ప్రభుత్వ బెదిరింపులకు బీసీలు ఏమాత్రం బెదరలేదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను, పల్నాడులో తోట చంద్రయ్యను కిరాతకంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గాలకు భయపడని బీసీల కోసం నా చివరి శ్వాస వరకు పనిచేస్తా. రాష్ట్ర టీడీపీ అధ్యక్ష పదవి, స్పీకర్ పదవి సహా పలు కీలక శాఖల మంత్రి పదవులను బీసీలకే ఇచ్చాం.' అని సీఎం అన్నారు.

# చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగం!

- జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం పాల్గొనటం గర్వకరం
- మగ్గాలకూ ఉచిత విద్యుత్ - రూ. 30,000 వరకు ఆదాయం
- చేనేతకు శిక్షణలు, మార్కెటింగ్, మద్దతు పథకాలు
- టిడిపి హయాం లో చేనేతకు ప్రాధాన్యం, సంక్షేమం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**మంగళగిరి, ఆగస్టు 7(ఎల్లో సింగం):**
గురువారం మంగళగిరి ఆటోనగర్ లోని మంగళగరి హాండ్లూమ్ డెవలప్మెంట్ సెంటరు (వీవర్ శాల) వద్ద జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్య, ఐటీ మరియు ఆర్టీజీఎస్ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, చేనేత మరియు జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, శాసనమండలి సభ్యులు పంచుమూర్తి అనురాధ, చేనేత మరియు జౌళి శాఖ సలహాదారు సుచిత్ర ఎల్లా పాల్గొన్నారు. వీవర్ శాల వద్ద ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించి, వీవర్ శాలలో చేనేత కార్మికులతో ముఖాముఖి గా సమావేశం అయ్యారు. జాతీయ చేనేత దినోత్సవం సంధర్భంగా ప్రజా వేదిక సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.
రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతలకు పెద్దపీట వేయటంతో 2014-2019 కాలంలో చేనేతలకు స్వర్ణయుగంగా గడించిందని, నందమూరి తారక రామారావు నుంచే చేనేతలను తెలుగు దేశం పార్టీ అక్కున చేర్చుకుందన్నారు. కానీ 2019-2024 మధ్యలో గత ప్రభుత్వం చేనేతల సంక్షేమానని పట్టించుకోకుండా రోడ్డున పడవేయటంతో చాలా సమస్యలు ఎదుర్కోన్నారని, చాలా మంది అత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఎర్పడిన వెంటనే చేనేతలను అక్కున చేర్చుకున్నారన్నారు. చేనేతల కుటుంబాలు ఎంతో కష్ట జీవులని, నూలు పోగులకు వస్త్రాలుగా తయారు చేసి మనుషుల మానాన్ని కాపాడుతున్నారన్నారని వారికి అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ నిరంతరం సూచనలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు చేనేతలకు మగ్గాలు ఉన్న వారికి 200 యూనిట్లు, మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ను అమలు చేయటం జరుగుతుందన్నారు. దీని వలన మగ్గాలు ఉన్న వారకి సంవత్సరానికి రూ.15,000 వరకు, మరమగ్గాలు ఉన్న వారికి రూ.30,000 వరకు ప్రభుత్వం అసరా అందింస్తుందన్నారు. చేనేత వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాల కోసం ప్రతి నెల ఎగ్జిబిషన్లు, కార్పోరేట్ సంస్థలతో ఎంవోయులు ఏర్పాటు చేస్తున్నామని, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు, చేనేత క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల ద్వారాను చేనేత కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు.
జాతీయ చేనేత దినోత్సవానికి మంగళగిరికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రాష్ట్ర ఉన్నత విద్య, ఐటీ మరియు ఆర్టీజీఎస్ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, చేనేత మరియు జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, గుంటూరు రేంజీ డీఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శాసనమండలి సభ్యులు పంచుమూర్తి అనురాధ, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, చేనేత మరియు జౌళి శాఖ సలహాదారు సుచిత్ర ఎల్లా , రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఛైర్మన్ నందనం అబద్ధయ్య స్వాగతం పలికారు.

# చేనేతకు చైతన్యం.. పూర్వ వైభవం తిరిగి తెస్తాం!

- ఆదివారపుపేట, అద్దంపల్లి నేతన్నల దత్తత
- చేనేత యూనిట్లకు విద్యుత్ రాయితీ
- నూలు కొనుగోలుపై సబ్సిడీ, జీఎస్టీ మినహాయింపు
- నేతన్న నేస్తం ద్వారా రూ. 25,000 ఆర్థిక సహాయం
- ముద్రా రుణాలుగా రూ. 45 లక్షలు మంజూరు
- 50 ఏళ్లు పై నేతన్నలకు రూ. 4,000 పింఛన్
- ఆగస్ట్ 16న సమస్యలపై సమీక్షా సమావేశం
- 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి'లో 4 చేనేత అవార్డులు
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు
- గౌరవ జీవనానికి చేనేతకు భరోసా పథకాలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు 7(ఎల్లో సింగం):**
చేనేత రంగానికి జవసత్వా లు తీసుకుని వచ్చి పూర్వ వైభవం తీసుకొచ్చి, వారి బతుకులు వెలుగులు ప్రచురింపజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. గురువారం స్థానిక మండల పరిధిలోని ఆదివారపు పేట గ్రామంలో 11 వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట చేనేత కార్మికుల కష్టాలు విన్న మంత్రి స్పందిస్తూ ఆదివారపు పేట, అద్దంపల్లి గ్రామాలకు చెందిన చేనేత కార్మికులను దత్తత తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో కలిసి మగ్గాల యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేయబడిన చేనేత రంగానికి రాష్ట్ర ముఖ్య మంత్రి జవసత్వాలు తీసుకొచ్చేందుకు మగ్గానికి 200, మరమగ్గానికి 500 యూనిట్లు విద్యుత్ రాయితీని ప్రకటించడంతో జిల్లా లో 60 లక్షలు రూపాయలు దీని ద్వారా లబ్ధి చేపడు తుందన్నారు. త్రిప్ట రుణాలు మంజూరు చేస్తూ ఆప్కో ద్వారా విక్రయాలు మరలా పునరు ద్ధరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు, నూలు పై సబ్సిడీ ఇస్తూ చేనేత వస్త్రాల విక్రయాలపై ఐదు శాతం జీఎస్టీ మినహాయింపు కల్పించడం జరిగిం దన్నారు. వీటికి అదనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో నేతన్న నేస్తం కింద మరో రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీ చేనేత రంగ మంత్రి సమక్షంలో మరిన్ని సమస్యల పరిష్కారానికై సమావేశం నిర్వహించి తగు నిర్ణయాలు గైకొని, సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. చేనేత కార్మికులు కూటమి ప్రభుత్వానికి వెన్నెముకగా నిలిచారని వారి సంక్షేమానికి అన్ని విధాలుగా ముఖ్య మంత్రి ప్రత్యేక చొరవతో కృషి చేయడం జరుగుతుందన్నారు. ముద్రా రుణాల కింద 90 మంది నేతన్నలకు మంజూరైన 45 లక్షల రుణాల మంజూరు చెక్కును పంపిణీ చేశారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి అందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగానికి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసి ఏడాది పాటు ఉపాధి కల్పనకై నేతన్నల ఆర్థిక అభివృద్ధికి పథకాల రూ పొందించడం జరిగిందన్నారు. అలాగే 50 ఏళ్లు వయసు పైబడిన నేతన్నలకు రూ. 4 వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. నూలు కొను గోలుపై సబ్సిడీ కల్పించడం క్లస్టర్ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి వీవర్స్ శాలల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికా యుతంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేనేత వస్త్రాలు వినియోగం పెంచడానికి ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. చేనేత కార్మికుల నైపుణ్యం వెలికి తీసే ఉద్దేశంతో నూతన డిజైన్లు దరఖాస్తులు ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్నారు. ఒక జిల్లా ఒకే ఉత్పత్తి పథకానికి సంబంధించి కేంద్రం నుండి 26 అవార్డులకు గాను ఏపీకి 9 అవార్డులు దక్కాయని వాటిలో 4 అవార్డులు చేనేత రంగం సంబంధించిన రావడం గర్వకారణమన్నారు.
ఎం ఎస్ ఎం ఈ పార్కులలో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటా యించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు వస్తున్నాయని తెలిపారు. ఏడాది కాలం నుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవ ప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాలకు ప్రభుత్వం నాంది పలి కిందన్నారు. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ నదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై అధారపడి జీవిస్తున్నారన్నారు. లక్షలాది మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారన్నారు. మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసునని, వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉందన్నారు. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరన్నారు. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయ న్నారు. పంచె కట్టులో పురుషులు, చీరకట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, అకర్షణీయంగా, సాంప్ర దాయం ఉట్టిపడే విధంగా కనిపిస్తారన్నారు నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ రంగులు వస్త్రాలకు అందాల విందులు అరబోస్తాయన్నారు . నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి సంకేతంగా గాంధీజీ నూలు వడికే రాట్నం ముందు కూర్చొని ప్రచారం చేయడం చూసామన్నారు. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యం త్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించ నంతగా అభివృద్ధి చెంద డం జరిగిందన్నారు. మంగ ళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగ ధగలు, కోట చీరల కమనీయాలు, కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు నేటికీ మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తూనే ఉన్నా యన్నారు. అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనోపాధిని కల్పిస్తున్న దనీ ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ నంపదకు నిదర్శనంగా నిలుస్తున్నద న్నారు. దేశ సామాజిక- ఆర్థిక నుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇచ్చిందన్నారు.
స్వతంత్ర భారతంలో చేనేత హస్త కళలకు ప్రాధాన్యత చాలా ఎక్కువ న్నారు. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించా లంటే అయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలన్నారు. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం, కాలంతో పాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ డిజై న్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా చేసుకొని మార్కెట్లో డిమాండ్ ఉన్న చేనేత వస్త్రాల తయారీపై దృష్టి పెట్టి జీవనోపాదులను మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేశారు మన మూలాలను వెతుక్కుంటూ, నదాచారాలను పాటిస్తూ, అరోగ్యకర చేనేత వస్త్రాలను ధరిస్తూ, నేతన్న కు బాసటగా నిలవాలన్నారు. ప్రభుత్వం ద్వారా సమకూర్చే సహాయ సహ కారాలను సకాలంలో అందిస్తూ అన్ని విధాలుగా అండగా భరోసాగా నిలు స్తామన్నారు ఈ కార్యక్ర మంలో చేనేత జౌళి ప్రాంతీయ సంచాలకులు ధనుంజయరావు, ఆర్డీవో దేవరకొండ అఖిల, అసిస్టెంట్ డైరెక్టర్ జౌలిశాఖ పెద్దిరాజు,తాసిల్దారు బి. మృత్యుంజయరావు, ఎంపీడీవో పద్మజ్యోతి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సొసైటీ సెక్రటరీలు ఏ డి ఓ లు గుర్రాజు వెంకటేశ్వరరావు, డివో లు గంగరాజు, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదన కాదు..

# సహాయంలోనే సంతృప్తి!






- **నాటి జన్మభూమి సమాజం కోసం..**
- **నేటి పీ4 పేదరిక నిర్మూలన కోసం**
- **పెట్టుబడులు + పేదలకు దత్తత.. సరికొత్త శక్తి**
- **పేదరిక నిర్మూలనకు పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యం**
- **సమాజం ఎదగాలంటే, అందరితో కలిసి ముందుకు!**
- **సాయం చేయడం గొప్పతనం, దాతృత్వం మార్గం**
- **సమాజాన్ని బలపర్చే కో-స్పాన్సర్ విధానం ప్రారంభం**
- **ప్రగతికి ప్రజల భాగస్వామ్యం అవసరం: సీఎం**
- **పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, ఆగస్టు 7(ఎల్లో సింగం):**
సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పారిశ్రామికవేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా గతంలో కోరేవాడినని.. ఇప్పుడు పెట్టుబడులు పెట్టడంతో పాటు.. పేదలకు సాయం చేయాలని కూడా అడుగుతున్నానని చెప్పారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హొటల్లో గురువారం పీ4 జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పారిశ్రామిక వేత్తలతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా ఉండాలని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..”పీ4 కార్యక్రమం గురించి తలుచుకున్న ప్రతిసారి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలం. నాది సుదీర్ఘ రాజకీయ జీవితం. జాతీయ స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపించాం. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన ఆంధ్రప్రదేశ్ లో, జాతీయ స్థాయి రాజకీయాల్లో చాలా క్రియాశీలంగా పని చేశాం. ఎన్నో సంస్కరణలు తెచ్చాను. కానీ ఎప్పుడూ కలగని తృప్తి.. పీ4 కార్యక్రమం ద్వారా కలుగుతోంది. సంస్కరణల వల్ల సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు వందల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడితే చాలు అవి అతి పెద్ద ప్రాజెక్టులుగా ఉండేవి.. కానీ ఇప్పుడు లక్షల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు వస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల వల్లే ఇది సాధ్యమైంది. 1995లో టెక్నాలజీలో వచ్చిన సంస్కరణల ద్వారా ఫలాలను అందిపుచ్చుకున్నాం. ఆర్థిక సంస్కరణలను కొందరు అందిపుచ్చుకున్నారు. కొందరు వెనుకబడ్డారు. సంస్కరణలను అందిపుచ్చుకున్న వారు ఉన్నత స్థానానికి చేరారు. అంబేద్కర్, ఎన్టీఆర్, అబ్దుల్ కలాం, మోదీ వంటి వారు సామాన్య కుటుంబాల్లోనే పుట్టారు. నాతో సహా ఈ సమావేశంలో ఉన్న చాలా మంది సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చారు. నాడు సమాజం నుంచి ఎంతో సహకారాన్ని అందుకున్నాం.. ఉన్నతస్థితికి చేరాం. ఇప్పుడు అసమానతలు లేని సమాజం కోసం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. ఉన్నత స్థానంలో ఉన్నవారు చేసేది చిన్న సాయమే కావచ్చు.. పేదరికంలో ఉన్నవారికి ఆ సాయమే అతి పెద్ద ఆలంబనగా ఉంటుంది.” అని చంద్రబాబు చెప్పారు.

### ప్రభుత్వానిది సంక్షేమం.. పారిశ్రామిక వేత్తలది సాయం..

“మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో నేను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. మార్గదర్శిగా నిలిచాను. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు నా సహచర మార్గదర్శకులతో పోటీ పడతా. ఇప్పటి వరకు 10,81,281 మంది కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. అనేక సంస్కరణలు వచ్చినా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా.. ఇంకా పేదరికం ఉంటూనే ఉంది. పేదరిక నిర్మూలన చేపట్టాలనే ఆలోచన నుంచే పీ4 పుట్టింది. ఎంత సంపాదించినా ఇక్కడే వదిలి పెట్టి వెళ్లాలి.. అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే...సమాజానికి మరింత మంచి చేసిన వాళ్లు అవుతారు. పేదరికంలో ఉన్నవాళ్లకి చేయూతనివ్వాలి.. వాళ్లకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి. సరైన సమయంలో గైడ్ చేయగలిగితే.. పేదరికంలో ఉన్న వాళ్లు కూడా మంచి స్థాయికి వెళ్లడానికి అవకాశం కల్పించినవారవుతారు. ప్రాధాన్యత క్రమంలో బంగారు కుటుంబాలకున్న అవసరాలపై సర్వే చేయించాం. ప్రభుత్వం వైపు నుంచి చాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పించన్ ఇస్తున్నాం, తల్లికి వందనం ఇచ్చాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అలాగే ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందివ్వనున్నాం. ప్రభుత్వ పరంగా మేం చేయాల్సిదంతా చేస్తున్నాం.. ఉన్నత స్థితిలో ఉన్నవారు కూడా బాధ్యత తీసుకుంటే దత్తత కుటుంబాల్లో స్కిల్స్ పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు. బంగారు కుటుంబాలను కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి.” అని చంద్రబాబు కోరారు.

### పీ4లో కో-స్పాన్సర్ విధానాన్ని తెస్తున్నాం...

“సమాజంలో మనతో ఉన్నవాళ్లు.. పేదరికంతో ఇబ్బందులు పడుతూ ఉండడం మంచిది కాదు. అవనిగడ్డలో ఓ పారిశుధ్య కార్మికురాలు కూడా మార్గదర్శిగా ఉండేందుకు ముందుకు వచ్చి.. ఓ పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్దమైంది. నేను ఎవర్ని బలవంతం పెట్టడం లేదు. బాధ్యతగా చూడాలనే చెబుతున్నాను. సాయం చేయడంలో రకరకాలు ఉంటాయి.. ఇటీవల కాలంలో కొందరు టీచర్లు ముందుకు వచ్చారు. చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామని చెబుతున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని కో-స్పాన్సర్స్ విధానాన్ని తెస్తున్నాం. ఆర్థిక సాయం చేసే వారు చేస్తారు.. అలాగే విజ్ఞానాన్ని అందించే వారు కూడా ఆ దిశగా కృషి చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు విజన్ 2020 రూపకల్పన చేశాను. నన్ను విమర్శించారు. కానీ ఇప్పుడు ఆ విజన్ నిజమైంది. లక్ష్యంతో పని చేస్తే ఏదైనా సాధ్యం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలుగువారిని ప్రపంచంలో అగ్రభాగాన నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నాం. దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. త్వరలోనే భారత్ ప్రపచంలో మూడో పెద్ద ఎకానమీగా ఎదగబోతోంది. భవిష్యత్తులో భారత దేశం ఎకానమీలో నెంబర్-1 స్థానంలో ఉంటుంది. అభివృద్ధి ఫలాలు అందరికి అందాలనే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేస్తున్నాం.” అని చంద్రబాబు వివరించారు.

### పెద్ద ఎత్తున స్పందించిన పారిశ్రామిక వేత్తలు...

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పారిశ్రామికవేత్తలు.. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చంద్రబాబు పిలుపుతో పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ముందుకు వచ్చారు. అలాగే ఆన్ లైన్ సమావేశంలో పాల్గొన్న ఇంకొందరు ఎన్నారైలు కూడా మార్గదర్శకరులుగా ఉంటామని సీఎంకు హామీనిచ్చారు. ప్రకాశం జిల్లాకు చెందిన మోహన్ రెడ్డి అనే పారిశ్రామిక వేత్త ఓ మండలంలో 729 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు వచ్చారు. సౌదీ నుంచి వచ్చిన రాధాకృష్ణ, మహ్మద్ అరిఫ్, సుచరిత వంటి వారు 10 కుటుంబాలను దత్తత తీసుకుంటామని చెప్పారు. అలాగే వరప్రసాద్ అనే పారిశ్రామిక వేత్త కూడా తనతో పాటు.. ఇంకొందరు గ్రూపుగా ఏర్పడి.. బొమ్మనహాళ్ మండలాన్ని దత్తత తీసుకున్నామని.. దీనికి సంబంధించిన ఓ రిపోర్ట్ తయారు చేసి ఇస్తామని చెప్పారు. కూరపాటి అనే ఎన్నారై 160 స్కూళ్లను దత్తత తీసుకుంటామని.. గొర్రెపాటి చందు అనే వ్యక్తి 10 కుటుంబాలు తీసుకోవడంతో పాటు.. తమ మిత్రులతో కలిసి.. మరో 100 కుటుంబాలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళూరి భాను అనే ఎన్నారై 20 కుటుంబాల్లోని పిల్లలకు చదవు చెప్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. యూఎస్ కు చెందిన విశ్వప్రసాద్10 కుటుంబాలు.. సింగపూర్ కు చెందిన రాంబాబు అనే వ్యక్తి 2 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సంసిద్దత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఎన్నార్టీ ఛైర్మన్ వేమూరి రవి, ప్రణాళిక శాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు సహకారంతో దేవాలయాల అభివృద్ధి

**- ఆత్మకూరులో అలఘునాథ స్వామివారి కుంభాభిషేకంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు**

**- స్వామివారి ఆశీసులతో ప్రజలు సంతోషంగా ఉండాలి**

కోవూరు(ఏల్లో సింగం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి పాలనలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలఘునాథ స్వామివారి మహా కుంభాభిషేకంలో వారు పాల్గొన్నారు. ముందుగాఆలయానికి చేరు కున్న వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు, సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయ శిఖరానికి అభిషేకం చేసి...అలఘునాథ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో జరిగిన శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథ స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 800 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీ అలఘునాథ స్వామిని దర్శించుకోవడంఅదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామివారి పునఃప్రతిష్ట చేసి 12 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆలయాల పవిత్రత, హిందూ ధర్మ రక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ.. పాలన సాగిస్తున్నారని వివరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారని, ఇప్పటికే తల్లికివందనం, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే.. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న సీఎం చంద్రబాబు గారికి స్వామివారి ఆశీసులు అందాలని ఆయన ఆకాంక్షించారు. కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ఎంతో ఘన చరిత్ర ఉన్న అలఘునాథస్వామివారిని దర్శించుకోవడం



సంతోషంగా ఉందని చెప్పారు. ఆనం రామనారాయణరెడ్డి గారి సహకారంతో ఆలయం అభివృద్ధి చెందిందని వివరించారు. అలఘునాథ స్వామివారి ఆశీసులతో జిల్లాతో పాటు ఆత్మకూరు ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి దంపతులు, టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశీర్వాదంతోనే ఎంపీటీసీగా ఎన్నికయ్యాను - చల్లంచర్ల కామేశ్వరి



విడవలూరు బిట్ - 1 ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన చలంచర్ల కామేశ్వరి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారిని నెల్లూరులోని ఆమె నివాసంలో  మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. తెలుగుదేశం పార్టీ ఎంపిటీసీ అభ్యర్థినిగా ఎంపిక చేసి ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారికి చల్లంచర్ల కామేశ్వరి కృతజ్ఞతలు తెలియ చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి సహకారంతో విడవలూరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ స్థానిక టిడిపి నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పర్వేక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతి కలిసిన వారిలో ఈస్టర్ ఛానల్ డిసి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏటూరు హరి రెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యం రెడ్డి, కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్యుత్ రెడ్డి  తదితరులు వున్నారు.

## విశాఖలో అట్టహాసంగా ఏపీఎల్ సీజన్ -4 ట్రోఫీ  ఆవిష్కరణ..!



బొబ్బిలి బ్యూరో ఎల్లో సింగం ప్రతినిధి.... ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరగనున్న ఏపీఎల్ సీజన్-4 ట్రోపి ఆవిష్కరణ కార్యక్రమం విశాఖలోని నోవటెల్ హెూటల్ లో శనివారం ఉదయం అట్టహాసంగా జరిగింది. ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, ఏసీఏ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాసరావు, టీమ్ కెప్టెన్స్ ఎమ్.హేమంత్ రెడ్డి- భీమవరం బుల్స్, రికీ బుహీ - సింహాద్రి వైజాగ్ లయన్స్, ఎస్.కె. రషీద్-రాయల్స్ ఆఫ్ రాయలసీమ, కె.ఎస్.భరత్-కాకినాడ కింగ్స్, కె.మహీప్ కుమార్ - తుంగభద్ర వారియర్స్, జి.హనుమ విహారి -అమరావతి రాయల్స్, కె.అశ్విన్ హెబ్బర్ విజయవాడ సన్ షైనర్స్ లతో కలిసి  ఆవిష్కరించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కు ఉన్న పేరు ప్రఖ్యాతలు మరింత పెంచేలా ఏపీఎల్ సీజన్-4 ను నిర్వహిస్తున్నట్లు ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు తెలిపారు...

# రాజకీయ పార్టీలకు అతీతంగా ఆదివాసులు ఐక్యమవ్వాలి

### నవోత్సవాల్లో  భాగంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి  కుంజ శ్రీను పిలుపు.

రంపచోడవరం ఆగస్టు 7 (ఏల్లో సింగం ప్రతినిధి): ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9న పురస్కరించుకొని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఈనెల ఒకటో తేదీ నుంచి  ప్రతి ఆదివాసి గూడెంలో ఆదివాసి నవోత్సవాలను నిర్వహిస్తుంది ఈ సందర్భంగా గురువారం నాడు ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటుచేసిన ఆదివాసి చైతన్య సదస్సుకి ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివాసి రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యమై ఆదివాసి హక్కులు చట్టాల కోసం పోరాడాలని ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9 యొక్క ఉద్దేశం కూడా ఆదివాసుల తమ హక్కుల్ని కాపాడుకోవాలని సూచిస్తుందని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి చట్టాలు ఉల్లంఘించి గిరిజనఏతరులు వలసలు రావటం తోటి వాళ్లతో పాటు నాన్ ట్రైబల్ రాజకీయ పార్టీలు ఏజెన్సీ ప్రాంతాల్లోకి చొరబడి ఆదివాసీల ఐక్యతను దెబ్బతీశాయని. నాన్ ట్రైబల్స్ పార్టీలు, నాన్ ట్రైబల్స్ ఏజెన్సీ ప్రాంతానికి చొరబడకముందు ఆదివాసీలంతా ఐక్యంగా మమేకమై జీవించేవారని. నేడు నాన్ ట్రైబల్స్ కుట్రల తోటి ఆదివాసిలంతా విచ్ఛిన్నమైపోయి పార్టీలకు బానిసలుగా, నాన్ ట్రైబల్ కి తొత్తులుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఇలాంటి విభజించు పాలించు కుట్రల వలన ఆదివాసీలు తమకు తెలియకుండానే భారత రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు కల్పించబడ్డ చట్టాలు నీరు గారి పోతున్నాయని.ారత రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు కల్పించబడ్డ చట్టాలు నీరు గారి పోతున్నాయని హక్కులు




హరించిపోతున్నాయని సంస్కృతి అంతరించిపోతుందని ఆయన అన్నారు. దీని కారణంగా ఆదివాసీల అభివృద్ధి రక్షణ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఇప్పటికైనా ఆదివాసీలందరూ ఒకే తాటిపైకి వచ్చి నాన్ ట్రైబల్స్ కుట్రల నుండి, రాజకీయ పార్టీల బానిసత్వం నుండి విముక్తి పొంది చైతన్యవంతులై ఆదివాసి హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికి కూడా ఆదివాసులు మేల్కొనకపోతే భవిష్యత్ తరాల ఆదివాసులకు మనుగడ ఉండదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వాలు ఆదివాసులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అన్ని హక్కులను ఆదివాసులకు దక్కే విధంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో  మాజీ యం పి టి సి పోడియం క్రిష్ణ, తెల్లం జంపన్న, సొందే రమేష్ వార్డ్ మెంబర్, మీడియం సురేశ్ వార్డ్ మెంబర్, కణితి రాజు పూజారి, మడకం వెంకటేష్, సవలం లక్ష్మణ్, ఉయిక సింగయ్య తదితరులు పాల్గొన్నారు

# సచివాలయ ఉద్యోగిని ఎనిమిది మంది వ్యక్తులు కారులో కిడ్నాప్






దేవీపట్నం  ఆగస్టు 7 ( ఎల్లో సింగం ప్రతినిధి) అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం దేవీపట్నం మండలం శరభవరం పంచాయతీలో %ూజూ 31 ుజీ% 1462 కారులో 8 మంది మారణ ఆయుధాలు తో అమ్మాయిని బెదిరించి కిడ్నాప్ చేసిన దృశ్యం. సంచలనం సృష్టించింది. వివరాల్లోకెళితే సోయం శ్రీ సోమ్య శరభవరం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పనిచేస్తుంది. గురువారం ఉదయం సుమారు 10 30 నిమిషాలకు గుర్తుతెలియని ఎనిమిది మంది వ్యక్తులు ఆ అమ్మాయిని బలవంతంగా కారు వరకు ఈడ్చి కెళ్ళి కిడ్నాప్ కు పాల్పడిన సంఘటన శరభవరం సచివాలయంలో చోటుచేసుకుంది. సచివాలయంలో ఉన్న పలువురు పెద్ద పెద్ద కేకలు వేస్తూ పోలీసులకు తెలియజేయండి అంటూ పరిగెట్టిన అతివేగంతో కారులో ఎక్కించుకుని పరారయ్యారు. రంపచోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు మాట్లాడుతూ కిడ్నాపర్లను గుర్తించడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని మారేడుమిల్లి మండలానికి సంబంధించిన ఒక వ్యక్తి తన ముగ్గురు స్నేహితులతో కలిసి కిడ్నాప్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని నాలుగు వైపులా పోలీస్ బృందాలు గాలింపులో నిమగ్నమయ్యాయని త్వరలోనే  దుండగులను గుర్తిస్తామని ఆయన తెలిపారు.

# ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం

## ముఖ్య అతిధిగా హాజరైన భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు





పాల్గొన్న కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, కార్యదర్శి మరియు కరస్పాండెంట్ సుంకర అనిల్, ప్రిన్సిపాల్ డా. జివికేఎస్వి ప్రసాద్ , వైస్ ప్రెసిడెంట్ లంక అరుణ్,ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, కళాశాల విద్యార్దులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు కు డిగ్రీ సర్టిఫికేట్ లు అంద చేసిన వెంకయ్య నాయుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు కళాశాలలు, యూనివర్శిటీ లకు వెళ్లి ప్రసంగించే కార్యక్రమాలు పెట్టుకున్నానునేను పదవీ విరమణ చేశాను కానీ.. పెదవీ విరమణ చేయలేదు దేశ భవిష్యత్తు గురించి నేటి తరానికి చెప్పాలనేదే నా సంకల్పం డిగ్రీ పట్టాలు అందుకున్న ఈరోజు జీవితం లో మరచిపోలేని రోజుప్రపంచంలో నేడు మన దేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది ప్రపంచ ఆర్థిక అభివృద్ధి లో నాలుగో స్థానంలో ఉన్నాం త్వరలోనే మూడో స్థానానికి చేరుతాం కొన్ని అగ్ర దేశాల బెదిరింపులు కు మనం భయపడేది లేదు మన పంచభూతాలను మనం గౌరవిస్తే.. అవి మనల్ని కాపాడతాయి మన తెలివిని దోచుకుని.. వారి గురించి గొప్పగా బ్రిటిష్ వారు చెప్పుకున్నారు స్వాతంత్ర్యం వచ్చాక మన తెలివి తేటలతో మనం సొంతంగా ఎదిగాం 75 యేళ్ల స్వాతంత్ర్య భారతావనిలో మనం అమృత కాలంలో ఉన్నాం నేటి తరం అంతా మన దేశ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలి భారతదేశం ఎప్పుడూ ఏదేశం మీద దండయాత్ర చేయలేదు మన మూలాలు దెబ్బ తీయడానికి గతంలో చాలా కుట్ర లు చేశారు మన సంస్కృతి ని నిర్వీర్యం చేయాలని చూశారు అన్నీ తట్టుకుని, నిలదొక్కుకుని నేడు నిలబడ్డాం నేడు మనకు ఎన్ని అవకాశాలు ఉన్నాయో... అన్ని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు కు ఐక్యత తో ఉండేలా చూడాలి కుల, మత, ప్రాంత బేధాలు ఉండకూడదు 16 యేళ్లుగా ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో మంచి విద్యను బోధిస్తున్నారు విద్యార్థులు కు సంస్కారం తో ఉండేలా అలవాటు చేయాలి విద్యాలయం, గ్రంధాలయం, సేవాలయం ఉండేలా చూడాలి కన్నతల్లిని, పుట్టిన ఊరుని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదు ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా నీ ఊరును మరచిపోకు నీకంటే ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిని చేతనైనంతలో చేయూత ను ఇవ్వాలి చదువు తోపాటు డిగ్రీ సంపాదించడమే కాదు.. సంస్కారం, విజ్ఞానం సంపాదించడం ముఖ్యం భావి తరాలు ఈ అంశాలను గుర్తు పెట్టుకోండి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉన్న సవాళ్లను ఎదుర్కొనేలా మీ మేధస్సు తో పని చేయాలి మన దేశంలో ఉన్న యువత ప్రపంచంలో ఎక్కడా లేరు దేశం ముందు, ఆ తరువాత పార్టీ లు, ఆ తరువాత స్వలాభం నేడు ఇందుకు రివర్స్ లో ప్రాధాన్యత ఇస్తున్నారు ఇటువంటి అంశాలు మన దేశానికి మంచిది కావు ఇంజనీర్లు అందరూ మీ శ్రమ, పట్టుదల, మేధస్సు తో మంచి ఫలితాలు సాధించాలి ఏ పని అయినా కష్టం తో కాదు .. ఇష్టం తో చేస్తే.. కలలు సాకారం అవుతాయి..ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులో కి వస్తుంది వాటిపై మనం పూర్తి అవగాహన పెంచుకోవాలి మన సాంకేతికత ను ఉపయోగించి మంచి పంటలు పండేలా చేయాలి రైతు నేడు చాలా నష్టపోతున్నాడు.. ఇంజనీర్లు వ్యవసాయ రంగం పై దృష్టి పెట్టాలి మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా మన పని తీరు ఉండాలి ఉషారామ విద్యార్థులు అంటే ఎక్కడికి వెళ్లినా గొప్పగా చెప్పుకోవాలి ఎవరికి వారు సొంతంగా కాళ్లపై నిలబడేలా చిన్న పరిశ్రమ లు అయినా నెలకొల్పండి కేవలం ఉద్యోగం కోసమే అన్వేషిస్తూ ఆగిపోకండి సూర్యోదయానికి ముందే మంచం దిగడం అలవాటు గా మార్చుకోండి సెల్ ఫోన్ ఎక్కువ గా వాడితే... మన మైండ్ సెల్ లోకి వెళ్లి నట్లే పిల్లలు సృజనాత్మక శక్తి తో పనిచేయడం మానేశారు ఆలోచన శక్తి అనేది లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది ఇప్పుడు ఏది అడిగినా గూగుల్ అంటున్నారు.. మాతృభాష లోనే విద్య ఉండాలని మోడి నిర్ణయం తీసుకున్నారు మాతృభాషలో ఉన్న మధురత్వం ఎందులోనూ లేదు మన తెలుగు వారంతా తెలుగు భాషలోనే మాట్లాడండి గుడ్ మార్నింగ్ లు వద్దు... నమస్కారం.. మన సంస్కారం ఫస్ట్ మదర్ టంగ్, తరువాత బ్రదర్ టంగ్, మూడోది ఆంగ్ల భాష రాంనాథ్ కోవింద్ హిందీ లోచదివారు, వెంకయ్య నాయుడు తెలుగులో చదివారు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి యన్.వి.రమణ తెలుగులో చదివే ఎదిగారు ఏ భాషలో చదివాం అని కాదు..విషయ పరిజ్ఞానం పెంచుకుని ఇక్కడ వరకు వచ్చాం నేటి తరం కూడా మీ పని తీరు, పరిజ్ఞానం, కష్టపడటం పై దృష్టి పెట్టండి ఏ భాష ను బలవంతంగా రుద్దకూడదు.. ఏ భాషను మనం వ్యతిరేకించకూడదు ప్రతిరోజూ నడక, వ్యాయామం, యోగా చేయడం ముఖ్యం పిజ్జాలు, బర్గర్లు తినడం ద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు మన సంప్రదాయ భోజనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది మన ఇడ్లీ, మన దోశ, మనసాంబారు, గుంటూరు కారం ప్రపంచంలో ఫేమస్ అయ్యాయి మన ఆహారపు అలవాట్లు వదలకుండా అమలు చేయండి మోడీ ప్రవేశ పెట్టిన యోగా 170 దేశాలు అమలు చేస్తున్నాయి యోగా మోడీ కోసం కాదు.. మన బాడీ కోసం అనేది తెలుసుకోండి మన తల్లిదండ్రులు ను గౌరవించండి.. బామ్మ, తాతయ్య లతో కాసేపు గడపండి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయకండి.. ఆక్రమణ లు నిరోధించండి మొన్న బుడమేరు ముంపు తరువాత అయినా పాఠాలు నేర్చుకోండి ప్రతి ఒక్కరూ మనం ఎక్కడి నుంచి వచ్చామనేది మరచిపోకండి మన తెలుగు భాషా వైభవం, మన సంస్కృతిని చాటి చెప్పండి.

## కార్యకర్తల అభీష్టమే పార్టీకి శిరోధార్యం-ఎమ్మెల్యే శిరీష దేవి





మారేడుపల్లి ఆగస్టు 7 ఎల్లో సింగం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారు పేరుగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎం. శిరీష దేవి విజయ్ భాస్కర్ అన్నారు. మారేడుమిల్లి లో గురువారం పార్టీ స్థానిక సంస్థాగత ఎన్నికల సమావేశం మండలం పార్టీ అధ్యక్షులు గురుకు శేషుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో సాగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకి సముచిత స్థానం కల్పిస్తుందని సూచించారు. కష్టకాలంలో ఎవరు పార్టీ జెండా మోసారో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ హామీలు ఎంత వరకూ గ్రామస్థాయిలో తీసుకు వెళ్లారో అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ సమన్యాయం దిశగా ముందుకు వెళ్లాలని కార్యకర్తల అభీష్టం మేరకు పదవులు వస్తాయని కాస్త సంయమనం పాటించాలని కోరారు. అలాగే వక్తలు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎస్. వెంకటేశ్వరరావు, మండలం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు సీ హెచ్ అప్పారావు తదితరులు మాట్లాడుతూ పార్టీ విధి విధానాలు అలాగే గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం మన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గ్రామస్థాయిలో అందరికీ అర్థం అయ్యే రీతిలో చైతన్యం చేయాలని సూచించారు. మన ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎలా ముందుకు తీసుకు వెళ్తుంది. గత ప్రభుత్వం చేసిన వైఫల్యాలు పై వివరించారు. మండల%దీ%పార్టీ అధ్యక్ష పదవికి 5 గురు పోటీలో ఉంటుండగా ప్రతీ ఒక్కరి అభిప్రాయం సేకరించి అధిష్టానానికి పంపిస్తామని పరిశీలకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ లు వీరవల్లి జార్జి, సాధల ప్రేమ్ కుమార్ రెడ్డి, సార్ల రమాదేవి, ఎంపీటీసీ లు ఎస్.గున్నమ్మ, కె. సువర్ణ రాజు, సొసైటీఅధ్యక్షులు పల్లాల లక్ష్మీ భూపతి రెడ్డి, సొసైటీ డైరెక్టర్ లు జి.హరి భాస్కర రావు, ఎమ్ రమణమ్మ, ఏ ఎమ్ సీ డైరెక్టర్ వేగు అమ్మాజీ, రాష్ట్ర మైనారిటీ విభాగం నాయకులు షేక్ సుభానీ, షేక్ భసీర్, రాష్ట్రీటీ ఎన్ ఎస్ ఎఫ్ట్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు దూడ సువర్ణ కర్ణ కుమార్, కర్రి సన్యాసి రెడ్డి, యువజన నాయకులు దూడ ప్రణీత్ అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. పొన్నా రవి కుమార్



తిరుపతి,ఆగస్టు 7/ఎల్లో సింగం

ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంభంగా గుర్తింపు పొందిన పాత్రికేయ వృత్తికి నూతన ఉత్సాహాన్ని అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం పట్ల వర్కింగ్ జర్నలిస్టుల తరఫున అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కొన్ని పరిమితులు గల వారికే వర్తించిన మీడియా అక్రిడిటేషన్‌ను ఇకపై వాస్తవంగా పని చేస్తున్న విలేకరులకు కూడా అందించనున్నట్టు పార్లమెంటులో ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం.ఈ నిర్ణయం వృత్తిపరంగా మేం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపనుంది. ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా పని చేస్తూ న్యూస్ రూమ్ నుంచి బయట వరకూ నడిచే విలేకరులకు ఇది ఒక మేలు సంకేతం. పత్రికా స్వేచ్ఛను కాపాడుతూ, విలేకరుల హక్కులను పరిరక్షించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబద్ధత ఈ నిర్ణయంతో మరింత స్పష్టమైంది.ఇలాంటి చారిత్రక నిర్ణయాన్ని తీసుకోవడంలో ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, సమాచార ప్రసారశాఖ కార్యదర్శుల చొరవను హృదయపూర్వకంగా అభినందించుకుంటున్నాం. వాస్తవికంగా ఫీల్డ్‌లో కష్టపడే జర్నలిస్టులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన ఈ గుర్తింపు మా వృత్తి పట్ల మరింత నిబద్ధతను పెంపొందిస్తుంది.ప్రజల మనోభావాలను నిస్వార్థంగా ప్రసారం చేసే పాత్రికేయులకు ఈ నిర్ణయం ఒక న్యాయమైన గౌరవం. ఇది జర్నలిస్టులకు నూతన ఆశలు రేకెత్తిస్తోంది. ఈ మేరకు ప్రతి రాష్ట్ర ప్రభుత్వము కూడా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు మంజూరు చేయాలని కోరుతున్నాం అని వర్కింగ్ జర్నలిస్టు పి రవికుమార్ తెలియజేశారు.

# ఇందుకూరుపేటలో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు విజయవంతం చేద్దాం – తహసిల్దార్ కె.సత్యనారాయణ

**దేవీపట్నం ఆగస్టు 7( ఎల్లో సింగం ప్రతినిధి)** :అల్లూరి సీతారామరాజు జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం ఇందుకూరుపేట లోని స్త్రీ శక్తి భవనంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలు ఏర్పాటుచేయ్యటం జరిగింది.కావున దేవీపట్నం మండలంలో ఉన్న ఆదివాసీ ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివాసి సంఘాల నాయకులు,ఆదివాసి ప్రజా సంఘాల నాయకులు, ఆదివాసి ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు మొదలైన ఆదివాసి పెద్దలందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవీపట్నం తహసిల్దార్ కె.సత్యనారాయణ,దేవీపట్నం సాల్మన్ రాజు,ఏవో వెంకట్రావు ఈరోజు జరిగిన ముందస్తు సమావేశంలో తెలియజేశారు.ఈ సందర్భంగా తహసిల్దార్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అధికారికంగా ఇందుకూరుపేటలోని స్త్రీ శక్తి భవనం నందు ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణ కోసం ప్రభుత్వం వారు అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున దేవీపట్నం మండలంలో ఉన్న ఆదివాసి ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల నాయకులు,యువతీ యువకులు, మహిళలు, ఆదివాసి ప్రజా ప్రతినిధులు మొదలైన ఆదివాసి పెద్దలందరికీ ప్రత్యేకంగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మేడే మిత్రులందరూ కూడా రావలసిందిగా కోరు



తున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర,కలుం సూర్య ప్రకాష్,మడి మురళి,పండా ఏడుకొండల దొర,మడకం బంగారు బాబు,అరగాటి వీరభద్రారెడ్డి, మరియు ఆదివాసి ఉద్యోగులు మొదలైనవారు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం ...రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం

**రంపచోడవరం ఆగస్టు 7 (ఏల్లో సింగం ప్రతినిధి):**
గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి క్యాంపు కార్యాలయంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తారీఖున ప్రపంచ ఆదివాసి దినోత్సవం రంపచోడవరం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్లో (వై టి సి) ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. రంపచోడవరం ఏడు మండలాల హెడ్ కోటర్స్ లో ఆయా తాసిల్దార్లతో, ఎంపీడీవోలతో, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో



ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించే విధంగా సంబంధిత అధికారులకు ఉత్తర్వుల ద్వారా ఆదేశించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఏజెన్సీలోని గిరిజన తెగలు అన్ని కలిసికట్టుగా ఘనంగా నిర్వహించుకోవాలని అదేవిధంగా ఈ ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి ఆదివాసి గిరిజనులందరూ పాల్గొని ఘనంగా నిర్వహించాలని ఆయన అన్నారు. వివిధ గిరిజన తెగలకు సంబంధించిన ఆదివాసి సంఘాలన్నీ కలిసికట్టుగా ముందుకు వచ్చి ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించే విధంగా ఆదివాసి సంఘాలని ముందుకు రావాలని ఆయన అన్నారు.

## యార్లగడ్డ 54, 55వ బూత్ నందు “ సుపరిపాలనలో తొలి అడుగు”



**యార్లగడ్డ ఎల్లో సింగం న్యూస్**
చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో “ సుపరిపాలనలో తొలి అడుగు” కార్యక్రమం యార్లగడ్డ 54, 55వ బూత్ నందు జరిగినది. ఈ టిడిపి ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగినది.. ఈ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం యొక్క సుపరిపాలన లక్ష్యాలను ప్రజలకు చేరవేయడం జరిగినది..ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు క్లస్టర్ ఇంచార్జ్ మోర్ల. శివ, %ూూూూ% చైర్మన్ పెద్ద బోయిన హరినాథ్, యార్లగడ్డ గ్రామ టిడిపి అధ్యక్షులు తొట్టెంపూడి. శివ పాండురంగారావు, బూత్ ఇన్చార్జులు శంకర రామ కోటేశ్వరరావు, నందూరి శ్రీనివాసరావు, బొబ్బ కృష్ణారావు, తొట్టెంపూడి . పాండురంగారావు , మురాల రంగారావు , కాకర్లమూడి గోపి, యార్లగడ్డ కోటేశ్వరరావు , గుత్తికొండ సుబ్బారావు , తొట్టెంపూడి రతీష్ బాబు , తొట్టెంపూడి రాధాకృష్ణ , తదితరులు పాల్గొన్నారు

## రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీ మృతి

### -పూర్తి స్థాయి విచారణ చేయించడం జరుగుతుంది... రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం

**రంపచోడవరం ఆగస్టు 7 (ఏల్లో సింగం ప్రతినిధి):**
గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి క్యాంపు కార్యాలయంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ దేవీ పట్నం మండలం దామనపల్లి గ్రామానికి చెందిన పండా సింధు 29 సంవత్సరాలు భర్త చంద్రశేఖర్ గర్భిణీ స్త్రీ అయినటువంటి పండా సింధు గత కొద్ది రోజుల క్రితం గర్భిణీతో డెలివరీ కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ అవ్వడం జరిగిందని అదేవిధంగా ఆవిడ పరిస్థితి సీరియస్ కండిషన్ ఉండటం ఆవిడ పరిస్థితి సీరియస్ కండిషన్ ఉండటం వలన డెలివరీ కోసం రాజమండ్రి ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని అదేవిధంగా ఈనెల ఆరో తారీకు రాత్రి గర్భిణీ స్త్రీ అయినటువంటి సింధు మృతి చెందడం జరిగిందని వైద్యాధికారులు తెలియజేసిన వెంటనే స్పందించి ఈఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా డి సి హెచ్ ఎస్ డాక్టర్ నీలవేణి, ఈస్ట్ గోదావరి జిల్లా రాజమండ్రి డి సి హెచ్ ఎస్ డాక్టర్ పద్మావతి ఇరువురు దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సంఘటనలో ఏమైనా తప్పులు ఉన్న యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

## గాయపడ్డ లొట్టి త్రినాథ్ ను పరామర్శ మెరుగైన వైద్యం అందించాలని వైద్యా సిబ్బందిని ఆదేశించిన....

### మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**రంపచోడవరం ఆగస్టు 7 (ఏల్లో సింగం ప్రతినిధి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన టీడీపీ నాయకులు లోట్టి త్రినాథ్ పై బుధవారం సాయంత్రం పెదబయలు మండల కేంద్రంలో తన నివాస గృహం ఆవరణంలో భూ తగాదా పేరుతో దాడి చేశారు. దాడి లో తలకు తీవ్రమైన గాయం తో పాడేరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న త్రినాథ్ ను రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అల్లూరి జిల్లా కేంద్రం లో ఉన్న %++ఎ% ఆసుపత్రి లో శ్రావణ్ కుమార్



చేరుకుని బాధితులను పరామర్శించి పూర్తి స్థాయి వైద్యం అందించాలని అలాగే మెరుగైన వైద్య సేవలు అందించాలని వెనువెంటనే కోలుకునే విధంగా వైద్యం అందించాలని వైద్య సిబ్బందినీ ఆదేశించారు అలాగే ఏ అవసరం ఉన్నా నా దృష్టికి తీసుకొని రావాలి అని తెలుగుదేశం పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని అధైర్య పడవద్దు అని ధైర్యం గా ఉండాలని చికిత్స పొందుతూన్న లొట్టి త్రినాథ్ ను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తో పాటు బాకూరు సర్పంచ్ వెంకట రమణ రాజు శోభకోట సర్పంచ్ శశి భూషణ్ నాయుడు దారేలా సర్పంచ్ పాండు రంగ స్వామి గూడ సర్పంచ్ గ్యాన ప్రకాష్ స్టేట్ ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు క్లస్టర్ ఇంచార్జీ మురళి యూనిట్ ఇంచార్జి జక్కయ్య తదితరులు ఉన్నారు.

## నందూరి వేణు కుటుంబ సభ్యులను పరామర్శించిన విక్కుర్తి

**అవనిగడ్డ::: ఆగస్టు 7:: ఎల్లో సింగం న్యూస్**
అనారోగ్య కారణాలతో ఇటీవల ఆకస్మికంగా మరణించినయువకుడు నందూరి నాగవేణు కుటుంబ సభ్యులను పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి




వెంకట శ్రీనివాసరావు పరామర్శించారు. అవనిగడ్డ మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నందూరి వేణు ఇటీవల అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ గురువారం ఉదయం కొత్తపేటలోని గృహంలో వేణు తండ్రి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చిన్న వయస్సులో నందూరి నాగ వేణు మరణించడం పట్ల విక్కుర్తి ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చిన్న వయస్సులో నందూరి నాగ వేణు మరణించడం పట్ల విక్కుర్తి ఈ సందర్భంగా విచారం వ్యక్తం చేశారు.విక్కుర్తి రాంబాబు,న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, రేపల్లె ముసలయ్య, బర్మా బుజ్జి, రేపల్లె ఈశ్వరరావు, రేపల్లె మధు,బర్మా శ్రీనివాసరావు, బొప్పన రమణ, రాజా, హరి కిరణ్ తదితరులు వేణు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# రైతులకు మెరుగైన సేవలు అందించండి

**-వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన కమిటీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన**

**-ఎమ్మెల్యే సునీతను కలిసిన రాచానపల్లి, చియ్యేడు, ముట్టాల నూతన కమిటీల సభ్యులు**

**-ఎమ్మెల్యే సునీతకు ధన్యవాదాలు, ఘనంగా సత్కారం**



అనంతపురం(ఎల్లో సింగం ప్రతినిధి)

రైతులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని.. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన కమిటీ సభ్యులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాచాన పల్లి, చియ్యేడు, ఆత్మకూరుమండల పరిధిలోని ముట్టాలసంఘాలకు సంబంధించి నూతన కమిటీని ఎంపిక చేశారు.రాచానపల్లి పిఎసిఎస్అధ్యక్షుడిగా పాము రాయి కలిమి శెట్టి రఘు, సభ్యులుగా చిన్నంపల్లికి చెందిన ఎమ్.శ్రీనివాసులు, కొడిమికి చెందిన బండి నారాయణని ఎంపిక చేశారు. చియ్యేడు అధ్యక్షుడిగా చియ్యేడు బోయ లక్ష్మీనారాయణ, సభ్యులుగా ఆకుతోటపల్లికి చెందిన సాకే శ్రీరాములు, పూలకుంటకు చెందిన సుధాకర్ రెడ్డిలు ఎంపికయ్యారు. ఆత్మకూరు మండలం ముట్టాల %ాూజూ %అధ్యక్షులుగా ముట్టాల బోయ గంతి లింగన్న, సభ్యులుగా సిద్దరాంపురం కురుబ నారాయణప్ప, మదిగుబ్బ బోయ బొమ్మయ్య (ప్రకటించాల్సి ఉంది) ఎంపికయ్యారు. వీరంతా బుధవారం సాయంత్రం అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు మండలాలకు సంబంధించిన సుమారు వందమందికి పైగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కృతజ్ఞతలు తెలిపారు. తమను అధ్యక్షులుగా, సభ్యులుగా నియమించినందుకు ఎమ్మెల్యే సునీతకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా మీకు మంచి పదవులు వచ్చాయని... దీనిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇవ్వడం, వ్యవసాయ ఇన్ పుట్ సబ్సిడీ లను అందించడం, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించడం వంటి సేవలను మెరుగ్గా అందించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కచ్చితంగా తమకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తెలియజేశారు....

## మారెడ్డి లతారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించండి

**- ఉపఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మడకశిర ఎమ్మెల్యే రాజు**

**- పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థి తరపున జోరుగా ఎన్నికల ప్రచారం**



పులివెందుల :(ఎల్లో సింగం ప్రతినిధి):

పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల సందర్భంగా కూటమి తరపున పోటీ చేస్తున్న మారెడ్డి లతారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పులివెందుల ఓటర్లను మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు విజ్ఞప్తి చేశారు. పులివెందుల మండలంలోని ఆర్.తుంపలపల్లి ఎస్సీ కాలనీలో పార్టీ నేతలతో కలిసి ఎం.ఎస్.రాజు లతారెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆర్.తుంపలపల్లి ఎస్సీ కాలనీలోని ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అక్కడి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేశారు. పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డిని గెలిపిస్తే, తమ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.రాజుతో పాటు ఉమ్మడి అనంతపురంజిల్లా ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టి. బి. ఓడిపోతుంది దేశం గెలుస్తుంది డాక్టర్ రిచేర్డ్



వాయల్పాడు (ఎల్లో సింగం ప్రతినిధి):

క్షయ వ్యాధి ఓడిపోతుంది దేశం గెలుస్తుంది అని నగరి మడుగు వైద్యులు రిచేర్డ్ స్టీఫిన్ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని ఇందిరమ్మ కాలనీ లో నిర్వహిస్తున్న 104సేవలలో భాగంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మరియు టి. బి. పర్యవేక్షకులు నాగిరెడ్డి ప్రజలకు టీబి వ్యాధి పై అవగాహన కల్పించారు.. జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్బంగా వారు మాట్లాడుచు రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, దగ్గినపుడు గళ్ళ పడటం, గళ్ళ లో రక్తం పడటం, రోజు సాయంత్రం జ్వరం రావడం, గస, ఆయాసం, నీరసం, ఆకలి లేక పోవుట, బరువు తగ్గడం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి అయి ఉండవచ్చు అని అనుమాన పడి సమీపంలో ఉన్న ఆశాకార్యకర్త ను గాని ఆరోగ్య సిబ్బంది ని గాని సంప్రదించి వ్యాధి నిర్ధారణ కొరకు గళ్ళ పరీక్షలు, నిర్వహించి నిర్ధారణ ఐతే చికిత్స పూర్తిగా ఉచితము ఆరు నెలలు మందులు డాట్స్ ద్వారా అందించబడును మరియు టి. బి. ముక్తభరత్ ప్రధాన మంత్రి పోషణ అభియాన్ లో భాగంగా అనుబంధ పోషణ కొరకు టి. బి. రోగులకు నెలకు రూ 1000/-వారి ఖాతా లో జమ చేయ బడును.మరియు రెండు, ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. క్షయ వ్యాధి లేని సమాజం స్థాపిద్దాం అన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమము లో డాక్టర్ రిచేర్డ్ స్టీఫిన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టి. బి. పర్యవేక్షకులు నాగిరెడ్డి ఏ. ఎన్. ఎమ్.గాయత్రి,104వాహన సిబ్బంది,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

### రాష్ట్ర జి సి సి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



రంపచోడవరం ఆగస్టు 7(ఎల్లో సింగం ప్రతినిధి):

అల్లూరి జిల్లా కేంద్రం వంజంగి లో ఆగస్టు 9 నా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన ప్రాంతంలో గిరిజనులతో కలసి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందందాయకం అని ఆదివాసీ ప్రాంత ప్రజల కోసం నాడు స్వర్గీయ ఎన్టీ రామారావు 275జీవో ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాడు జీవో నెంబర్ 3 ఇచ్చి ఉద్యోగాలు కల్పించిన ఘనత టిడిపి కే దక్కుతుందని ఆదివాసీ అభివృద్ధి సంక్షేమం కోసం ఆలోచించే నాయకుడు చంద్రబాబు నాయుడు రాక కోసం ఆనంద సంతోషాలతో ఆదివాసీ ప్రజానీకం ఉన్నారని ప్రజా నాయకుడు పర్యటన విజయవంతం చెయ్యాలని చంద్రబాబు పర్యటిస్తున్న వంజంగి ప్రాంతాన్ని హెలిప్యాడ్ స్థలాలను అలాగే కార్యకర్తల సమావేశం ప్రదేశాని జిల్లా కలెక్టర్, జిల్లా %ూ్రా% లతో కలసి పర్యవేక్షించారు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలని అధికారులు నాయకులు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర %+జజ% చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాడేరు ఇంచార్జి గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, సర్పంచూలు పాంగి పాండురంగ స్వామి, బాకూరు వెంకటరమణ రాజు , మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, జక్కయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగిని కిడ్నాప్



దేవీపట్నం ఆగస్టు 7,( ఎల్లో సింగం ప్రతినిధి

అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం శరభవరం పంచాయతీ శరభవరం గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సౌమ్య శ్రీ కిడ్నాప్ కలకలం రేపింది ఇన్నోవా కార్లో ఏడుగురు వ్యక్తులు వచ్చి కత్తులు మరియు మారణాయుధాలు సచివాలయం సిబ్బందిని బెదిరించి సౌమ్య ని బలవంతంగా కారులోకి లాక్కుని వెళ్లిపోయారు సచివాలయంలో ఉన్న ఉద్యోగులు పెద్ద పెద్ద కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రజలు వచ్చేటప్పటికి కారులో నేలకోట అడివి దారిలో తీసుకు వెళ్లారని ఈలోపే పోలీస్ పోలీస్ సిబ్బందికి సచివాలయ సిబ్బంది సమాచారం అందించారు పోలీసులు హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టారు ఇదంతా ప్రేమ వ్యవహారాలే కొంతవరకు కారణాలు అవ్వచ్చని పోలీస్ వారు అనుమానం వ్యక్తం చేశారు. త్వరలోనే కిడ్నాపర్లని పట్టుకుని కఠిన చర్యలు విధిస్తామని తెలిపారు.

# మహిళా సంస్థలతోనే వ్యవస్థ బలోపేతం

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**ఆనందపురం, ఆగస్టు 7:** సమాజాభివృద్ధికి మౌలిక స్థంభంగా నిలుస్తున్న మహిళా సంస్థలు నేటి యుగంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విశాఖపట్నం లోని ఆనందపురం మండలం గంభీరంలోని హొటల్ చందనలో ఏర్పాటు చేసిన విశాఖ మహిళ కో ఆపరేటివ్ సొసైటీ రజతోత్సవ సభకు మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖ మహిళా కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ యలమంచిలి ప్రసూనాంబ మంత్రి అచ్చెన్నాయుడు కి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి , విద్య, ఆరోగ్య రంగాల్లో మహిళా సంస్థలు దోహదం చేస్తాయని అన్నారు. మహిళల సాధికారతే నేటి వ్యవస్థను బలంగా మార్చగల శక్తి అని, మహిళల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. 25 ఏళ్ల క్రితం కేవలం 10 మంది మహిళ ఉద్యోగులతో ప్రారంభమైన మహిళా కో ఆపరేటివ్ సొసైటీ 10 బ్రాంచీలు, రూ.100 కోట్ల వ్యాపార టర్నోవర్ సాధించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఆర్థిక విషయాల్లో మహిళలు అద్భుత ప్రతిభా కనబరుస్తున్నారని పేర్కొన్నారు. చిన్న వ్యాపారులు స్వయం సమృద్ధి సాధించేలా ముద్ర రుణాలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. చిన్న వ్యాపారులను ఆర్థికంగా నిలబెట్టడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మహిళల కోసం అన్న ఎన్టీఆర్ అనేక చట్టాలు, పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఆస్తిలో మహిళలకు సగం వాటా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు.. ఎన్టీఆర్ ఆలోచన నుంచి పుట్టినవేనన్నారు. 1995 సంవత్సరంలో



ఇందుకోసం యాక్ట్ తీసుకురావడం వల్ల అనేక కో ఆపరేటివ్ బ్యాంకులు పోటీలో నిలదొక్కుకున్నాయని చెప్పారు. మహిళల నిజాయతీ, నిబద్ధతల కారణంగానే డ్వాక్రా విజయవంతం అయ్యిందని తెలిపారు. పాతికేళ్ల నుంచి మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న విశాఖ మహిళా కో ఆపరేటివ్ సొసైటీ యాజమాన్యానికి, ఉద్యోగులకుఅభినందనలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళల శక్తిని వెలికి తీసే ప్రయత్నాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు.

# జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన

## వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా చేనేత కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత అనేది భారతదేశ సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. గ్రామీణ జీవిత శైలిని ప్రతిబింబించే ఈ రంగం దేశ ఆర్థిక, సాంస్కృతిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తోంది. చేనేత ఉత్పత్తులలో ఉన్న నైపుణ్యం, విలక్షణతకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించే దిశగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. వ్యవసాయం తర్వాత వేలాది మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది. అలాంటి రంగానికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం నేటి నుంచి ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం జరుగుతోంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారాన్ని భరించనుంది. దీంతో పాటు త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ.5 కోట్లు విడుదల చేయనుంది. చేనేత కళను ప్రోత్సహిస్తూ, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విధానాలు రూపొందిస్తున్నదని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.



## సింగల్ విండో చైర్మన్ గా కృష్ణమూర్తి బాధ్యతలు

**కుప్పం ఆగస్టు 07/ (ఎల్లో సింగం)** కుప్పం సింగల్ విండో చైర్మన్ గా టిడిపి నేత కృష్ణమూర్తి గురువారంబాధ్యతలు స్వీక రించారు . ముగ్గురు సభ్యులతో ప్రభుత్వం కుప్పం సింగల్ విండో కమిటీని ఏర్పాటు చేసింది. చైర్మన్ గా కృష్ణమూర్తి, డైరెక్టర్ల కృష్ణవేణి ,అన్నధుడి బాధ్యతలు స్వీకరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మరియు కుప్పం ఇంచార్జి పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మైనార్టీ కుప్పం అధ్యక్షుడు జాకీర్, కౌన్సిలర్ సోమశేఖర్, నాను మరియు కంగుంది 7వ క్లస్టర్ ఇంచార్జ్ హైదర్ వలీ ,టిడిపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







# చెత్తలు వేస్తే ఉపేక్షించేది లేదు

## పురపాలక కమిషనర్ ఎల్. రామలక్ష్మి

**బొబ్బిలి బ్యూరో ఎల్లో సింగం ప్రతినిధి :** ఖాళీ స్థలాల్లో చెత్తలు వేస్తే ఉపేక్షించేది లేదని పురపాలక కమిషనర్ ఎల్. రామలక్ష్మి అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా పురపాలక అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్ స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్ మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో సంఘవీధి, బ్యాంక్ కాలనీ, ఆకుల రెల్లి వీధి మరియు టీబీఆర్ థియేటర్ రోడ్డులో పర్యటించారు.సంఘవీధి మరియు బ్యాంక్ కాలనీ లో పారిశుధ్య పనులను పరిశీలించి పురపాలక కమిషనర్ ఎల్.రామల క్ష్మి అసంతృప్తి వ్యక్తం చే శారు. కాలువలలో సిల్టు తొలగించాలని, రోడ్లు పక్కన ఉన్న పిచ్చి మొ క్కలను తొలగించాలని శానిటరీ సిబ్బందికి సూ చించారు, ఖాళీ స్థలాల్లో చెత్తలు వేస్తున్న స్థల య జమానులను గుర్తించి నోటీసులు జారీ చేయా లని పురపాలక కమిష నర్ ఎల్. రామలక్ష్మి ఆదే శించారు. టీబీఆర్ థియే టర్ రోడ్డులో కాలువల నీరు రోడ్లపైకి వస్తుండ టంతో కమిషనర్ ఆగ్ర హించి వెంటనే క్లియర్ చేయించాలని శానిటరీ ఇన్ స్పెక్టర్ సిహెచ్ ముర ళీ, సెక్రటరీ లకు కమిష నర్ ఆదేశించారు.దోమ ల నివారణ చర్యలలో భాగంగా కాలువలలో షెడ్యూల్ ప్రకారం జరు గుతున్న ఫాగింగ్ మరి యు స్ప్రేయింగ్ పను లను పరిశీలించి ప్రతిరో జు క్రమం తప్పకుండా జ రిగేలా చూడాలని శాని టరీ ఇన్ స్పెక్టర్ సిహెచ్ మురళీ కి సూచించారు. గాంధీ బొమ్మ ఏరియా లో ఇంటింటి కుళాయిల యొక్క లీకేజీలను పరిశీ లించి వాటిని అరికట్టుట కు చర్యలు తీసుకోవాల



ని పురపాలక అసిస్టెంట్ ఇంజనీర్లకు కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశిం చారు. ఇటీవల వార్డుల లో నాటిన మొక్కలను పరిశీలించి మొక్కలకు పురపాలక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి సంరక్షించుటకు చ ర్యలు తీసుకోవాలని పు రపాలక అసిస్టెంట్ ఇంజ నీర్లకు పురపాలక కమిష నర్ ఎల్ రామలక్ష్మి ఆదే శించారు.ఈపర్యటనలో పురపాలక సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు...

## గ్రేటర్ టుడే పత్రిక న్యూస్ ఎడిటర్ డా.నేమాల

### హేమసుందరరావుకు జాప్ జిల్లా శాఖ ఆత్మీయ సత్కారం....



**బొబ్బిలి బ్యూరో ఎల్లో సింగం ప్రతినిధి :** సీనియర్ జర్నలిస్ట్ ఉప్పల లక్ష్మణ్ నాయకత్వంలోని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూనియన్ల కతీతంగా పత్రికా సంపాదకులకు ఘన సత్కారం చేశారు. అందులో భాగంగా గ్రేటర్ టుడే జాతీయ తెలుగు దిన పత్రిక న్యూస్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ డా.నేమాల హేమసుందరరావును జాప్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కేఎం కీర్తన, జేవీకే అప్పలరాజు ఇతర కార్యవర్గ ప్రతినిధులు ముఖ్య అతిథులచే దుశ్శాలువాతో ఆత్మీయ సత్కారం చేశారు.డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీసరస్వతి విద్యా విహార్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ కే.సంజీవ్,జాప్ జిల్లా శాఖ ప్రతినిధులు పీఏఆర్ పాత్రుడు, గంటా చంద్రశేఖర్, వడ్డాది ఉదయ్ కుమార్, గొట్టివాడ దానేష్,కె పృధ్వీరాజ్,సాయి, రాపర్తి శ్రీనివాసరావు, ఎస్ ఎన్ నాయుడు, వెంకట్, సురేష్, ఉద్యమం పత్రిక సంపాదకుడు గొండు అచ్యుతరావుసీనియర్ జర్నలిస్ట్ ఆడారి కొండలరావు పలువురు పత్రికా సంపాదకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఔదార్యం చాటుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ దంపతులు

## సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పేద గిరిజన కుటుంబానికి సహాయం అందేలా చేసిన కూనవరం మండల తెలుగుదేశం పార్టీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్‌లి

కూనవరం ఆగస్టు 7 ఎల్లో సింగం ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం పంద్రాజుపల్లి గ్రామానికి చెందిన కారం దుర్గా,కారం వినోద్ దంపతుల కుమార్తె కారం షణ్ముఖ ప్రియ వయస్సు 5 నెలల పాపకు ఆరోగ్యం బాగలేక కాకినాడ ఏరియా హాస్పిటల్ కు ట్రీట్మెంట్ కొరకు తీసుకువెళ్ళడం జరిగింది నిరుపేద కుటుంబం కూలిపని చేసుకుంటే తప్ప కుటుంబం గడవని పరిస్తితి ,తల్లిదండ్రులు పాప కోసం తమ పడే బాధను చూసి చలించిపోయి ఎమ్మెల్యే శిరీష పాప వైద్యానికి కావాల్సి ఏర్పాట్లు చేసినప్పటికి పాప ఆరోగ్యం విషమించి చనిపోవడం జరిగింది.ఆ పేద కుటుంబం పాప భౌతికకాయాన్ని తమ ఇంటికి కూడా తీసుకు వెళ్లలేని పరిస్తితి ఈ సమయంలో ఎమ్మెల్యే శిరీష పెద్ద మనసుతో ఏర్పాటు చేసిన మహాప్రస్తానం వాహనంలో పాప భౌతికకాయాన్ని పాప తల్లిదండ్రులను వారి ఇంటి వరకు తీసుకురావడం జరిగింది పాప ఆరోగ్య పరిస్థితిని గ్రామస్థుల ద్వారా తెలుసుకుని వెంటనే ఈ సమస్యను ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష భాస్కర్ విషయాన్ని చేరవేసిన కూనవరం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్. పాపకు మెరుగైన వైద్యం కొరకు కాకినాడ ఏరియా హాస్పిటల్ కి పంపడం తరువాత వాళ్ళ పరిస్తితిని ఎమ్మెల్యే దంపతులకు వివరించి వైద్యసహాయం మరియు పాప భౌతికకాయాన్ని ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన మహా ప్రస్తానం వాహనం ద్వారా వాళ్ల ఇంటికి చేర్చడంలో ఎంతో సహాయం అందించారుప్రసాద్ ఇంతకు ముందు కూడా గోదావరి వరదల సమయంలో ప్రవాహంలో కొట్టుకు వచ్చిన మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించి తన పెద్ద మనసును చాటుకొన్నారు ఎలా ఎవరో కష్టంలో ఉన్నా నేనున్నాను అని అందరికి తలలో నాలుక ఉండే గడ్డిపాటి ప్రసాద్ లాంటి నాయకులు చాలా అరుదు సామజిక సేవ కార్యకలాపాల్లో ముందుండి ఎంతటి సమస్యనైన పరిష్కరించి ప్రజల కోసం ఏ పని అయిన నేనున్నాను అంటూ భరోసా కల్పించి బాధ్యత తీసుకునే గడ్డిపాటి ప్రసాద్ లాంటి వ్యక్తులు తెలుగుదేశం పార్టీలో ఉండడం అందరికీ గర్వకారణం ఏది ఏమైనా మీరు మన ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష భాస్కర్ సారథ్యంలో



ఇలాంటి మంచి సేవ కార్యకలాపాలు చేసి పార్టీకి ఎమ్మెల్యే దంపతులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పరిపాలించే వ్యక్తులు చంద్రబాబు నాయుడు గారు నారా లోకేష్ ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ లాంటి మంచి గొప్ప వ్యక్తుల పాలనలో గడ్డిపాటి ప్రసాద్ గారి లాంటి మంచి వ్యక్తులే మండలంలో ప్రజలకు చాలా మేలు చేకూరుస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చేనేతకు చేయూత నిద్దాం.. నేతన్నను బ్రతికిద్దాం






బొబ్బిలి బ్యూరో ఎల్లో సింగం....

నిండైన భారతీయతకు నిజమైన అందాన్నిచ్చే చేనేతకు చేయూత ని చ్చి నేతన్నను బ్రతికించి చేనేత రంగాన్ని బ్రతికిం చుకోవలసిన భాద్యత ప్రతివారిపై ఉన్నదని రోటరీ జిల్లా అధ్యక్షులు జె సి రాజు పిలుపునిచ్చారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవ నేపథ్యంలో స్థానిక అర్ సీఎమ్ చర్చ్ వద్ద ఉన్న చేనేత కాలనీలో నివసి స్తున్న చేనేత కార్మికుల తో చేనేత దినోత్సవాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు వారణాసి శ్రీ హరి,కార్య దర్శి శివకాంత్ ల ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ స్వాతంత్య ఉద్యమంలో దేశాన్ని ఏకం చేసినది చే నేత రంగమేనని అన్నా రు.చేనేత భారతీయ సంస్కృతికి, సంప్రదాయానికి, గౌరవానికి,హుందాతనానికి చిహ్నంగా నిలుస్తున్నదని అన్నారు. కాలక్రమంలో పవర్ మగ్గాలు రావటం తో క్రమేపీ చేనేత వస్త్రా లు తమ ప్రాభవాన్ని కోల్పోయాయని తెలియజేశారు. నేతకార్మికులను ఆకలి తో అలమతించాల్సిన పరిస్థితులు చోటు చేసు కున్నాయని,ఆత్మహత్యలు కాలక్రమంలో పవర్ మగ్గాలు రావటం తో క్రమేపీ చేనేత వస్త్రా లు తమ ప్రాభవాన్ని కోల్పోయాయని తెలియజేశారు. నేతకార్మికులను ఆకలి తో అలమతించాల్సిన పరిస్థితులు చోటు చేసు కున్నాయని,ఆత్మహత్యలు చేసుకున్న సందర్భా లున్నాయన్నారు. ఎలాంటి దుర్భర పరిస్థి తుల్లో కూడా చేనేతను నమ్ముకున్న కార్మికుల కృషితో చేనేత వస్త్రాలు వాన్ డిస్ట్రిక్ట్ వాన్ ప్రొడక్ట్ కింద ప్రధమ స్థానాన్ని పొందటం గర్వించాల్సిన విషయ మన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని నిలబెట్టేలా తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. ఉచిత విద్యుత్,చేనేత సొసైటీ లకు త్రిఫ్ట్ ఫండ్ సమకూర్చడం,చేనేత వస్త్రాలకు జీఎస్టీ మిన హాయించటం గిట్టుబా టు ధర కల్పించటం తదితర చర్యలు ప్రభు త్వం తీసుకోవడంతో చేనేతకు మంచిరోజులు వస్తాయన్నారు. రోటరీ సభ్యులు చేనేత వస్త్రా అలు కొనుగోలు చేసి ధరించేలా కృషి చేస్తామ న్నారు.అనంతరం చేనే త కార్మికుల 25 కుటుం బాలకు స్వీట్ ప్యాకెట్ ల ను పంచి పెట్టారు. చేనే త కాలనీ పెద్దలకు దుస్సాలువాలతో ఘనం గా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ చైర్మన్ గె%శీ%బలి శ్రీనివాసరావు, కాలనీ పెద్దలు పి.రాజు,శ్రీను,రాము, త్రినాధ,ఈశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు...

# జిందాల్ బాధితులను జంతువుల్లా కాకుండా మనుషులుగా గుర్తించండి

**-చెప్పులు దండలతో , మొఖానికి నల్లరంగు వేసుకుని నిరసన**

**-ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆవేదన**



శృంగవరపుకోట, 07ఎల్లోసింగం ప్రతినిధి

సర్వం కోల్పోయిన జిందాల్ భూ బాధితులైన గిరిజన దళిత నిర్వాసితులను జంతువుల కాకుండా మనుషులుగా గుర్తించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు బొడ్డవరలో బుధవారం జిందాల్ బాధితులు తో మాట్లాడుతూ జిందాల్ బాధితులకు ఉన్న ఎటువంటి హక్కులు అమలు చేయడం లేదన్నారు జిందాల్ బాధితులకు జంతువులకు ఒకే ఒకటి తేడా ఉందని వీరందరూ ఓట్లు వేస్తారు జంతువులు ఓట్లు వెయ్యు ఆ ఒక్కటే తప్ప మిగిలిన అన్ని విషయాల్లోనూ సమానంగా ఉన్నారన్నారు కంపెనీ వస్తుందని, ఆ కంపెనీలో ఉద్యోగం ఉంటుందని, భూములు ఇచ్చినందుకు కంపెనీలో వాటా ఉంటుందని మమ్మల్నందర్నీ ముకుమ్మటగా నమ్మిస్తే నమ్మి మోసపోయి ఇప్పటికే ఒక తరం నష్టపోగా మా పిల్ల పాపలకి ఏదో భరోసా ఇవ్వండి అని 48 రోజులుగా ఆవేదన వ్యక్తం చేస్తుంటే జిందాల్ యాజమాన్యం ఒకపక్క ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ కోసం ప్లాట్లు వేసి భూమి అమ్మేందుకు సిద్ధపడుతుంటే భూములు ఇచ్చి మోసపోయిన రైతాంగం ఒకటే మాకు న్యాయం చేయండి మాభూమి మాకు ఇచ్చి మాకు ఉపాధి కల్పించండి నాటి హామీలు అమలు చేయండి మొరపెట్టుకుంటుంటే జిల్లా అధికారులుగానీ, ప్రభుత్వ పెద్దల గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకుండా అందాల నెరవేస్తులు అసలు మనుషులే కాదు జంతువులు అన్నట్టు చూడడం విచారకరమన్నారు గిరిజనులు ఓట్లకు తప్ప దేనికి పనికిరారని అన్నంత నిర్లక్ష్యంగా చూడ్డం సమాజంలో గిరిజనులకు దళితులకు జరుగుతున్న అన్యాయానికి కొలమాన అన్నారు ఎప్పటికైనా దళిత గిరిజన నిర్వాసిలను మనుషులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నాను

# అక్రమం తొలగింపు పై చంద్రగిరి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కి పిర్యాదు చేసిన

## చంద్రగిరి మండలం జనసేన సీనియర్ నాయకులు తపసి మురళి రెడ్డి




చంద్రగిరి ఆగస్టు 7/ఎల్లో సింగం

చంద్రగిరి మండలం తొండవాడ గ్రామ నివాసి తపసి మురళి రెడ్డి %o/శీ ు%.జయపాల్ రెడ్డి వందనములతో చేసుకున్న పోలీసు ఫిర్యాదు ఏమనగా అయ్యా తొండవాడగ్రామస్థులు, ప్రయాణ ికుల సౌకర్యార్థం తొండవాడ ముఖద్వారం చంద్రగిరి- తిరుపతి రహదారి పక్కన గతంలో ఉండిన బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవటంతో సదరు బస్సు షెల్టర్ ను తొలగించి దాని పక్కనే ఉంటున్న ప్రభుత్వ భూమి, మా గ్రామంలోని ఇందుమోళి రెడ్డికి చెందిన కొంత భూమిని కలుపుకుని ఇందుమౌళి రెడ్డి దాతృత్వంతో 7 సం.రాల క్రితం బస్సు షెల్టర్ నిర్మించడం జరిగింది. బస్సు షెల్టర్ కు దక్షిణముగా వేసిన వెంచర్ (రియల్ ఎస్టేట్) వ్యాపారస్తులు 06.08.25 వ తేదీ సుమారు 8.00 %జూఎ% సమయంలో హిటాచి తో బస్ షెల్టర్ ను ధ్వంసం చేసి కూలగొట్టి గ్రామస్తులు ప్రయాణికులకు తీవ్ర నష్టం కలిగించారు. వోల్టా చట్టాన్ని అధిగమిస్తూ బస్సు షెల్టర్ పక్కనే ఉంటున్న సుమారు 200 సంవత్సరాల వయసు గల మర్రిచెట్టును హిటాచితో కొమ్మలు తొలగించి పూర్తిగా దానిని తొలగించడానికి ప్రయత్నించగా గ్రామస్తులు వెళ్లి అడ్డుకోవడం జరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వారి స్వలాభం కోసం వారికి అనుకూలంగా వారి ప్లాట్లను అధిక రేట్లుకు అమ్ముకోవడానికి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే బస్సు షెల్టర్ ను వోల్టా చట్టాన్ని అధిగమిస్తూ బస్సు షెల్టర్ పక్కనే ఉంటున్న సుమారు 200 సంవత్సరాల వయసు గల మర్రిచెట్టును హిటాచితో కొమ్మలు తొలగించి పూర్తిగా దానిని తొలగించడానికి ప్రయత్నించగా గ్రామస్తులు వెళ్లి అడ్డుకోవడం జరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వారి స్వలాభం కోసం వారికి అనుకూలంగా వారి ప్లాట్లను అధిక రేట్లుకు అమ్ముకోవడానికి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే బస్సు షెల్టర్ ను తొలగించడమే కాకుండా వోల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ మర్రిచెట్టును నరికి హిటాచితో తొలగించిన వారిపై చర్యలు తీసుకుని మాకు సహాయం చేయవలసిందిగా ప్రార్థన సెల్ నం.98859 59337

# మార్కెట్ లో శ్రావణ సందడి

**- ఈ వారంలో వరలక్ష్మీ వ్రతం**
**- వచ్చేవారం వినాయక చవితి పండుగలు**
**- అప్పుడే చుక్కల తాకుతున్న పండ్లు. పూల ధరలు**

బొబ్బిలి బ్యూరో ఎల్లో సింగం ప్రతినిధి....
శ్రావణమాసం సందడి వచ్చేసింది. బొబ్బిలి మార్కెట్ లో శ్రావణ సందడి మొదలైంది. ఈనెల 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం.. ఈనెల 27వ తేదీ వినాయకచవితి ఉండటంతో మార్కెట్ కళకళలాడుతుంది. సాధారణంగా వరలక్ష్మీ వ్రతం ఆగస్టు నెలలో వస్తే వినాయక చవితి సెప్టెంబర్ మాసంలో వస్తుంది. ఇలా రెండు పండుగలు ఒకే నాలో రావడం, శ్రావణమాసం పేరు చెప్పి ఇప్పటినుంచే పూలు, పండ్లు ధరలకు రెక్కలు వచ్చేశాయి. కొన్ని రోజుల క్రితం వరకూ కేజీ రూ.250 నుంచి 300 ఉంటే చామంతి పూల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం మార్కెట్ లో కేజీ చామంతి ధరలు రూ. 450 నుంచి రూ. 500 వరకూ విక్రయాలు జరుపుతున్నారు.దీంతో రిటైల్ ధరలు చుక్కలను తాకేలా పెరిగిపోయాయి. గతంలో రూ.20 లకు చామంతి పూలు ఇవ్వమంటే కనీసం 15 నుంచి 20 పూలు వరకూ వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.రూ.20లకు చామంతి పూలు కావాలంటే కనీసం 10 పూలు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇక మల్లెపూలు, కనకాంబరాలు ధరలు ఇలానే ఉన్నాయి. మొన్నటి వరకు మూర రూ 40 అమ్మే మల్లెపూలు స్వస్థత రూ.80 వరకూ విక్రయాలు సాగిస్తున్నారు. కనకాంబరాలు పరిస్థితి ఇలాగే ఉంది.మూర రూ.30 కనకాంబరాలు పరిస్థితి ఇలాగే ఉంది.మూర రూ.30 అదనంగా వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పండ్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో రూ.100 కు ఐదు దానిమ్మ కాయలు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు కూడా రావడం లేదు. యాపిల్ కూడా సైజ్ నుబట్టి భారీ స్థాయి లో అమ్మకాలు జరుపుతున్నారు.రూ.500 పట్టి కెళ్తే కనీసం అవసరం అయిన పండ్లు వచ్చే పరి స్థితి లేదు.ధరలు అమాంతంగా పెరిగిపోవ డంతో వినియోగదారు లు బింబేలెత్తుపోతున్నారు. ఇప్పుడు ఎలా ఉంటే పండుగ దగ్గరలో పూలు, కొనే పరిస్థితి ఉంటుందా అంటూ సామాన్య ప్రజలు పెదవి విరుస్తున్నారు...





## సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



మదనపల్లి ఆగష్టు 07/ (ఏల్లో సింగం)
మదనపల్లి పట్టణం 7 వార్డు శివాజీ నగర్ లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి గురించి, లబ్ధి పొందిన పథకాల గురించి వివరిస్తూ వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించి కాలువలు, రోడ్లు, త్రాగునీరు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మదనపల్లి శాసనసభ్యులు శ్రీ ఏం. షాజహాన్ బాషా . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయనగరం 12వ, 15వ మరియు 16వ డివిజన్లలలో "సుపరిపాలనలో తొలి అడుగు"



విజయనగరం ఎల్లో సింగం న్యూస్ ::
"సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఈరోజు 12వ, 15వ మరియు 16వ డివిజన్లకు సంబంధించి గౌరవ శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పల్లి వీధిలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం పల్లివీధి జంక్షన్ మెయిన్ రోడ్డులో సమావేశం నిర్వహించడం జరిగింది. తదుపరి విజయనగరం మండలం రీమాపేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, గ్రామంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి ఇంచార్జ్ రీమా పేట, చిల్ల సత్యనారాయణ . జనసేన ఇంచార్జ్ శనాపతి నాగరాజు కార్యకర్తలో పాల్గొన్నారు..

## ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం అతి వైభవంగా జరుపుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## మంద కృష్ణ మాదిగ ఆలోచనలే నాటి ప్రభుత్వ ప్రతిరూపమే ఆరోగ్యశ్రీ పథకం

కుప్పం ఆగష్టు 07/(ఏల్లో సింగం)
ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం పురస్కరించుకొని మందకృష్ణ మాదిగ కి పాలాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు.కుప్పం మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తూ నివాళులర్పించి ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం పురస్కరించుకుని యంయస్పి కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజ్ కుమార్, మండల అధ్యక్షులు మురుగేష్ మాదిగ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యంఆర్పియస్ రాష్ట్ర కార్యదర్శి మరియు చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ ధనరాజు పల్లి కిషోర్ మాదిగ ,యంఆర్పియస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు మరియు కో ఇంచార్జ్ ప్రకాష్ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ మొదటిగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తర్వాత మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నంద్యాలలో ఒక మీటింగ్ లో ఉండగా అక్కడికి ముస్లిం వర్గం దూదేకుల కులానికి చెందిన నసీమా అనే ఆమె వచ్చి తన కుమారుడికి గుండెజబ్బు ఉంది అని మేము పేదవారు కావున మా వల్ల అంతా చికిత్స చేయడం అవ్వదని ప్రభుత్వం నుంచి సాయం చేపించాలని అన్నని వేడుకున్నారు. అప్పటికప్పుడు స్పందించిన మందకృష్ణ మాదిగ నాటి ముఖ్యమంత్రితో మాట్లాడితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా చికిత్స అందించాలని దీనిపై అవసరమైతే ఉద్యమం కూడా చేస్తానని తెలపడం జరిగిందని,ఈ పిలుపే అన్నది కాలంలో ఉద్యమంలా మారి ప్రభుత్వం దిగివచ్చేలా చేసి ఆగస్టు 7వ తేదీ ప్రజలందరికీ ఉచిత చికిత్స అందిస్తామని దాని పేరే ఆరోగ్యశ్రీ అని తెలిపారు. ఆ పథకమే అనతి కాలంలో దేశం మొత్తం విస్తరించి ఆయుష్మాన్ భవగా పథకంగా మారి ప్రజలందరికీ ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యంయస్పీ నియోజకవర్గ అధ్యక్షులు పాపన్న మాదిగ, నియోజకవర్గ సీనియర్ నాయకులు శాంతిపురం మండల అధ్యక్షులు రవీంద్ర మాదిగ, భోధగుట్టపల్లి రాజేష్ మాదిగ,కత్తి మానిపల్లి అరుణ్ మాదిగ కత్తి మానిపల్లి ప్రభువు మాదిగ, సురేష్ మాదిగ పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి కి హజ్ యాత్రికుల కృతజ్ఞతలు

**-24 గంటల్లో రూ.లక్ష రాయితీ చెల్లింపు పై హర్షం**
**-మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసిన విజయవాడ ఎంబార్కేషన్ యాత్రికులు**



అమరావతి, ఎల్లో సింగం న్యూస్ ::
విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను ఎన్నుకుని, తక్కువ యాత్రికుల కారణంగా విజయవాడ నుండి విమాన సర్వీసు రద్దుతో హైదరాబాద్ నుండి హజ్ యాత్రను పూర్తి చేసి ప్రభుత్వ రాయితీ ని అందుకున్న యాత్రికులు సియం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ముస్లిం మత పెద్దలు, సీనియర్ ఇమాములతో పాటు చేతిలో థ్యాంక్ యు సి. ఎం సార్ ప్లకార్డులు పట్టుకుని వారు కలిశారు.విజయవాడ ఎంబార్కేషన్ ఎన్నుకున్న హజ్ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు దృష్టికి తమ కృతజ్ఞతలను తీసుకువెళ్లాలని మంత్రి ఫరూక్ నువారు కోరారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎన్నుకున్న 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఇచ్చిన హామీ మేరకు రూ.72 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి 24 గంటల వ్యవధిలోనే బ్యాంక్ అకౌంట్లకు జమ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 2026 హజ్ కి విజయవాడ ఎంబార్కేషన్ ఎన్నుకున్న వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఏపీ నుంచి హజ్ కు వెళ్లే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి..

## -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి

**పెడన, ఎల్లో సింగం ప్రతినిధి....**

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అంకితభావంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి అధికారులకు సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన తన సిబ్బందితో గురువారం పెడన పట్టణం 14వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బంగ్లా స్కూల్), అదేవిధంగా బల్లిపర్రులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల, కళాశాల, పెడన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాలల్లో వంట గదులు, ఆహార పదార్థాల ముడి సరుకులు నిల్వ గది, సంబంధిత రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.బల్లిపర్రులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు సంబంధించి వసతి గృహంలో సరైన వసతులు లేవని, భోజనం నాణ్యతగా లేదని, నిద్రించుటకు గదులు ఇరుకుగా ఉన్నాయని విద్యార్థుల



తల్లిదండ్రుల నుండి వాట్సాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఈ క్రమంలో ఆయన అధికారులు, విద్యార్థులకు వేరువేరుగా చదివి వినిపించి వాస్తవాలపై విచారణ చేపట్టారు. అయితే విద్యార్థులు, సమస్యలేవీ లేవని, అధికారులు తమను బాగా చూసుకుంటున్నారని చైర్మన్కు బదులు ఇచ్చారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు చికెన్, ఆరు రోజులు గుడ్డు భోజనంలో విద్యార్థులకు అందించాలని, అదేవిధంగా సాయంత్రం స్నాక్స్, ఉదయం పాలు, రాత్రి ఫ్రూట్స్ తప్పనిసరిగా అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల అభీష్టం మేరకు అల్పాహారం ఉప్మాకు బదులుగా ఎగ్ రైస్ ను మెనూలో మార్చి పిల్లలకు అందించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జి మోహన్ రావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి భాగ్యలక్ష్మి, హనుమంతరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ రుతమ్మ, వార్డెన్ లక్ష్మీ ప్రియదర్శిని తదితరులు చైర్మన్ వెంట ఉన్నారు.

# సంక్షేమ సహాయకురాలు సోయం శ్రీ సౌమ్య అపహరణ ఆరోపణలు

## దర్యాప్తు కొనసాగుతుంది

అల్లూరి జిల్లా_ఆగస్ట్ 7, 2025న జరిగిన అపహరణ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు నమోదు అయ్యింది అని. ఈ సంఘటనలో నర్సాపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం సారభవరంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మల్లుడోరా కుమార్తె, 26 సంవత్సరాల సోయం శ్రీ సౌమ్య అపహరణకు గురయ్యారు.ఫిర్యాదు ప్రకారం, ఆగస్ట్ 7న ఉదయం 10:30 గంటల సమయంలో, వేటుకూరు గ్రామానికి చెందిన కాసిమ్కోట అనిల్ కుమార్ మరియు మరికొందరు సహాయంతో బూడిద రంగు ఇన్నోవా క్రిస్టా (%ూ్రా31 ుజీ% 1462) వాహనంలో ఆమెనుఅపహరించారని తెలుస్తోంది. గతంలో కూడా ఈ వీరు 21-10-2024న ఇలాంటి సంఘటనలో భాగంగా ఉన్నారు. ఆ సందర్భంలో దేవీపట్నం పోలీసు స్టేషన్ లో మహిళా కనుమరుగు కేసు (%జతీ. చీశీ%. 70/2024) నమోదు చేయబడింది.ఆ కేసు విచారణలో కుటుంబాల వ్యతిరేకత కారణంగా ఇద్దరూ స్వేచ్ఛగా తప్పించుకున్నారని, చిత్రకొండ (ఒడిశా)లో వారిని గుర్తించారు. పోలీసులు అప్రమత్తమై వెంటనే క్రింది చర్యలు తీసుకున్నారు: సారభవరం, మరేడుమిల్లి మరియు ప్రయాణ మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజ్ స్క్రూటినీ. సబ్-డివిజన్ మరియు సరిహద్దు ప్రాంతాల్లోని చెక్-పోస్టులకు సంబంధిత వాహనం పట్ల హెచ్చరిక. బాధిత మరియు ఆరోపితుడి స్వగ్రామాల్లో శోధనా కార్యకలాపాలు. ఆరోపితుడి మునుపటి ప్రాంతాలు మరియు తెలిసిన సహచరుల పరిశీలన. సంబంధిత వాహనం మరియు ఆరోపితుని వివరాలు అన్ని సమీప పోలీసు స్టేషన్లతో పంచుకోబడ్డాయి. ఈ కేసు గతంలో జరిగినట్లుగా అపహరణా లేక స్వచ్ఛందంగా తప్పించుకున్న సంఘటనా అనివిచారణ ద్వారా నిర్ణయించబడుతుంది. ప్రజలు సహకరించాలని మనవి. సంబంధిత సమాచారం ఉన్నవారు దయచేసి క్రింది నంబర్లకు కాల్ చేయండి: 9440900761, 9440796517. మీడియా సభ్యులను కూడా సహకరించాలనిఅభ్యర్థిస్తున్నాము. విచారణ లో మరిన్ని విషయాలు తెలియపరుస్తామని చెప్పారు.



# దసరా మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి..

## -జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, ఎల్లో సింగం ప్రతినిధి....**

దసరా మహోత్సవాలకు శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 22 నుండి నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గ గుడి అధికారులు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దుర్గా ఘాట్, జాతీయ రహదారి, మహా మండపం, కనకదుర్గ నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, చేస్తున్న ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. గత ఉత్సవాలలో భక్తులకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పునరావృతం కాకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మహా మండపం వద్ద ప్రసాదం క్యూ లైన్లను పరిశీలించి భక్తులకు అవసరమైన ప్రసాదాలను అందుబాటులో ఉండేలా చూడాలని ప్రసాదాల నాణ్యత, క్యూ లైన్ల వద్ద పరిశు భ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, ప్రసాదం పంపిణీ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్ ఈ ఏడాది కనకదుర్గ నగర్ నందు 10 ప్రసాదం కౌంటర్లతో పాటు అదనంగా 8 చోట్ల మొత్తంగా 18 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఆలయ పరిధి, వివిధ



ప్రదేశాలలో 250కు పైగా సిసి కెమెరాలతో కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసందానించి పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు.పరిశీలనలో కలెక్టర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.ఎస్ఆర్ కోటేశ్వరరావు, డిఇలు రవీంద్ర, అశోక్‌లు ఉన్నారు.

YELLOW SINGAM (VEERAMACHINENI BROADCASTING PRIVATE LIMITED) CHIEF EDITOR: VEERAMACHINENI SURYA CHOWDARY ADDRESS :40-9-99, Ramakrupa complex, Sai Nagar, Benz Circle, Vijayawada, Andhrapradesh, Pin: 520010 CELL: 9949093032 Email: yellowsingamcbn@gmail.com Website: www.yellowsingam.in